ఎంఇఒ పర్యటన

ప్రజాశక్తి-ముంచింగి పుట్టు : మండలంలోని లక్ష్మీపురం స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని పలు పాఠశాలల్లో మండల విద్యాశాఖ అధికారి కే కృష్ణమూర్తి తనిఖీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, లక్ష్మీపురం, హంసబంధ, సుత్తిగూడ పాఠశాలల్లో తనిఖీ నిర్వహించామని తెలిపారు. ఉన్నతాధికారులకు నివేదికలు పంపనున్నామన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలన చేసి మెనూ ప్రకారం అమలు చేయాలని సూచించారు. లక్ష్మీపురం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులకు సమావేశం ఏర్పరిచి క్యాలెండర్ ప్రకారం పాఠాలు పూర్తి చేయాలని తెలిపారు. లక్ష్మీపురం గ్రామం ఎంపీపీ పాఠశాల భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని లక్ష్మీపురం సర్పంచ్ కొర్ర త్రినాధ్ కోరారు. ఈ కార్యక్రమంలో సిఆర్పి జి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న ఎంఇఒ

సూపర్ సిక్స్ పథకాల అమలు ఏదీ?

-గిరిజన ప్రత్యేక డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలి

-సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స

ప్రజాశక్తి-అరకులోయ రూరల్ :గిరిజన ప్రత్యేక డీఎస్సీ పై బడ్జెట్ సమావేశంలో చర్చించి నోటిఫికేషన్ విడుదల చేయాలని అల్లూరి జిల్లా సిపిఎం కార్యదర్శి పి.అప్పలనర్స డిమాండ్ చేశారు. బుధవారం అరకులోయలో సిపిఎం 8వ మండల మహాసభ ఘనంగా జరిగాయి. సిపిఎం సీనియర్ నాయకులు కిల్లో మొద్దు జెండా ఆవిష్కరణ చేశారు.అనంతరం సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి చిత్రపటాన్ని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి అప్పలనర్స, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అప్పలనర్స మాట్లాడుతూ, జిఒ 3కు చట్టబద్ధత కల్పించి గిరిజన ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పేరుతో ఎన్నికల బరిలో దిగి తీరా గెలిచాక వాటిని మరిచి అమలు చేయకుండా పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తోందన్నారు.ఆదివాసీ ప్రాంతంలో జనాభా ప్రాతిపదికన బడ్జెట్ కేటాయింపులు 6.57శాతం కేటాయించాల్సి ఉండగా కేవలం 2.57 శాతం కేటాయించారన్నారు. ఈ బడ్జెట్ కేటాయింపులో ఆదివాసీలకు కూటమి ప్రభుత్వం తీవ్రంగా అన్యాయం చేసిందని విమర్శించారు.గిరిజన ప్రాంతంలో ఉన్న సహజ సంపదను కొల్లగొట్టిందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. గత ప్రభుత్వం విఒఎల కాలపరిమితి సర్కులర్ తీసుకొచ్చిందని, కూటమి ప్రభుత్వం దాన్ని రద్దు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తుందని మండిపడ్డారు.గ్రామ వాలంటీర్లను ఎన్నికల సమయంలో రెన్యువల్ చేసి, జీతాలు పెంచుతామని చెప్పి మాట తప్పారని విమర్శించారు.ట్రైబల్ సబ్ ప్లాన్ నిధులు మంజూరు చేసి గిరిజన ప్రాంతంలో అభివృద్ధి ఎందుకు ఖర్చు చేయడం లేదనీ ప్రశ్నించారు. పీవిటీజీకు జన్మన్ పథకం కింద ఇళ్ల నిర్మాణానికి ఐదు లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్ పేరుతో దోచుకోవాలని ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ఉచిత ఇసుక ఇస్తామని హామీ ఇచ్చి నేటికి అమలు చేయడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు, మండల కార్యదర్శి కె రామారావు, మండల కమిటీ సభ్యులు, జి చిన్నాబాబు, జన్నీ భగత్ రామ్, బుజ్జి బాబు, మగ్గన్న, రామన్న కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిసిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స

పట్టుబడిన రోజ్‌వుడ్ కలపతో అటవీశాఖ అధికారులు, సిబ్బంది

రోజ్ వుడ్ కలప స్వాధీనం

ప్రజాశక్తి-కొయ్యూరు

కొయ్యూరు మండలం చీడిపాలెం పంచాయితీ పరిధి కాకరపాడులో రోజ్ వుడ్ దుంగలను అటవీశాఖ అధికారులు బుధవారం ఉదయం స్వాధీనం చేసుకున్నారు. అటవీశాఖ అధికారులు తెలిపిన వివరాలు ప్రకారం... పెద్దవలస ఫారెస్ట్ రేంజ్ అధికారి శివరంజని, సెక్షన్ ఆఫీసర్ నూకరాజు ఆధ్వర్యంలో అటవీశాఖ సిబ్బంది కాకరపాడులో మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో కొప్పిశెట్టి లోవరాజు ఇంటి వద్ద 26 రోజ్ వుడ్ దుంగలను గుర్తించి ఇంటి వద్ద ఎవరు లేకపోవడంతో మంగళవారం రాత్రి ఆ ఇంటి వద్ద సిబ్బందిని గస్తీ ఉంచారు. బుధవారం ఉదయం రేంజ్ అధికారి శివరంజని పోలీస్ సిబ్బంది సహాయంతో రోజ్ వుడ్ దుంగలను స్వాధీనం చేసుకున్నారు. వీటితోపాటు బుధవారం పక్కన ఉన్న బిల్డింగులో తనిఖీ చెయ్యగా 19 రోజ్‌వుడ్, 5 టేకు, 20 గన్నర దుంగలను గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న కలపను చింతపల్లి డిఎఫ్ఓ ఆఫీసుకు తరలిస్తున్నట్టు పెదవలస రేంజ్ అధికారి శివరంజని తెలిపారు.

కలెక్టర్ సుడిగాలి పర్యటన

ప్రజాశక్తి- హుకుంపేట: మండలంలో జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ బుధవారం సుడిగాలి పర్యటన చేశారు. ముందుగా అండిబ పంచాయతి పివిటిజి గ్రామం నక్కగొయ్యి సందర్శించారు. నక్కగొయ్యిలో గ్రామస్తులు ఆప్యాయంగా మంగల హారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పిఎం జన్మన్ కింద మంజూరైన గృహాలపై ఆరా తీసిన కలెక్టర్ ఇంకా పదిమందికి గృహాలు అవసరమని గుర్తించారు. గృహ నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలని డిఇఇ రాజబాబును ఆదేశించారు. అండిబ నుండి ఎగువమోదపుట్టు గ్రామానికి ఆరు కిలో మీటర్ల రహదారి నిర్మాణానికి గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు వెంటనే ప్రతిపాదనలు సమర్పించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా పలువురు తమకు పించన్లు అందటం లేదని కలెక్టర్ దృష్టికి తీసుకు రాగా కొంతమంది అధిక విద్యుత్ వినియోగం, భూముల మ్యుటేషన్ వంటి సమస్యలున్నందున మంజూరు కాలేదని అధికారులు వివరించారు. కలెక్టర్ స్పందిస్తూ ఆయా ఫిర్యాదులను పూర్తి స్థాయిలో విచారించి తదుపరి చర్య నిమిత్తం నివేదిక సమర్పించాలని ఆదేశించారు.

పర్యటిస్తున్న కలెక్టర్

భీమవరం పంచాయతిలో విడివికె కేంద్రానికి చేరుకొని చీపుర్ల తయారీని పరిశీలించి వారి ఆదాయం గూర్చి ఆరా తీసారు. చీపుర్లకు ఒక బ్రాండ్ పెడితే మంచి ధర లభిస్తుందన్నారు. అవసరమైతే మార్కెట్ సదుపాయం కల్పిస్తామని కలెక్టర్ తెలిపారు. అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించి పిల్లలతో కాసేపు ముచ్చటించారు. అక్కడినుండి గుమ్మడిగుండువ పివిటిజీ గ్రామం చేరుకోగా గ్రామస్తులు రహదారి మంజూరుకు విజ్ఞప్తి చేసారు. పివిటిజీ గ్రామానికి పిఎం జన్మన్ కింద రహదారి మంజూరు చేయడం జరుగుతుందని హామీ ఇస్తూ 11 మండలాల ఫరిధిలో ఇలాంటి గ్రామాలను గుర్తించి నివేదిక అందజేయాలని డిఇఇ ధృవకుమార్ ను ఆదేశించారు.

పెదగరువు గిరిజన సంక్షేమ బాలికల వసతి గృహాన్ని సందర్శించి పాఠశాల పరిసరాలు, మరుగుదొడ్లు పరిశీలించారు. మరుగుదొడ్లలో సానిటరీ నేప్కిన్స్ పడివుండటాన్ని గుర్తించిన కలెక్టర్ అసంతృప్తి వ్యక్త పరుస్తూ వాటి డిస్పోజల్ కు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మాష్టారి అవతారమెత్తిన కలెక్టర్ విద్యార్థులతో లెక్కలు చేయించారు. బూర్జ పంచాయతి కొండయ్యపాడు, పటకదౌడ గ్రామాలలో పర్యటించి గ్రామస్తులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామస్తులు వారి గ్రామాలకు మంజూరైన జిఎస్బి, మెటల్ రోడ్ల స్థానంలో బిటి రోడ్డు మంజూరు చేయాలని కోరగా ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించారు. బూర్జ నుండి సొంటారిపాడు మీదుగా దిగసల్తంగి గ్రామానికి ఆరు కిలో మీటర్ల రహదారి నిర్మాణానికి వెంటనే ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించారు. వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు, సిడిపిఓ సిహెచ్ బాలమణి దేవి, వెలుగు ఏపీఎం అప్పాయమ్మ పాల్గొన్నారు.

జిసిసి చైర్మన్ కిడారికి అభినందనలు

ప్రజాశక్తి -పాడేరు : రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్ గా గా నియమితులైన కిడారి శ్రావణ్ కుమార్ కు బుధవారం విజయవాడలో రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు అభినందనలు తెలిపారు. ప్రభుత్వం తనను జీసిసి చైర్మన్ గా నియమించిన సందర్భంగా శ్రావణ్ కుమార్ వీరిద్దరిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ... తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని, జీసీసీని ప్రగతి పథంలో నడిపిస్తానని తెలిపారు. గిరిజనులకు ఆర్థికంగా ఎదగడానికి కృషి చేస్తానని వెల్లడించారు.

కిడారి శ్రవన్‌కుమార్‌ను అభినందిస్తున్న మంత్రి సంధ్యారాణి

కలప అక్రమ రవాణాకు అడ్డుకట్ట

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

రాజవొమ్మంగి రేంజ్ పరిధిలో కడప అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయడం జరిగిందని రాజవొమ్మంగి రేంజ్ అధికారి గుమ్మడి ఉషారాణి అన్నారు. బుధవారం ఆమె రాజవొమ్మంగి రేంజ్ కార్యాలయంలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ అటవీ పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇప్పటికే రేంజ్ పరిధిలోని అన్ని బీటుల్లో సిబ్బందిని ఎలార్ట్ చేయడం జరిగిందన్నారు. ఫైర్ వుడ్ వసతి గృహాలు, హోటళ్లు, ఇతర వాటికి తరలించేందుకు అనుమతులు లేవన్నారు. అక్రమంగా కలప తరలించినా, వృక్షాలు నరికినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో 96వేలు పువ్వుల మొక్కలు, పండ్లు, ఇతర మారుజాతి మొక్కలు నర్సరీలో పెంచడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అటవీ సిబ్బంది పి రాము. ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రేంజ్ అధికారి ఉషారాణి

ఎడిఇగా దుర్గా శ్రీనివాసరావు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-సీలేరు

సీలేరు కాంప్లెక్స్ పరిధి సీలేరులో సివిల్ విభాగంలో ఏపీ జెన్కో ఏడిఈగా కె.దుర్గా శ్రీనివాసరావు బుధవారం క్యాంపు కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు చేపట్టారు. ఈయన విజయవాడ ఎన్‌టిపియస్‌లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా సివిల్ విభాగంలో పనిచేశారు. ఏపీ జెన్కో యాజమాన్యం ఎడిఇగా పదోన్నతి కల్పిస్తూ సీలేరు ఏపీ జెన్కో క్యాంప్ కార్యాలయానికి బదిలీ చేసింది. ఈ మేరకు ఆయన బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు సీలేరులో ఏడాది పాటు ఏపీ జెన్కో ఏడిఈగా విధులు నిర్వహించిన వెంకటమధును మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రానికి బదిలీ చేశారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాసరావు

డోలీలో తరలిస్తున్న కుటుంబ సభ్యులు

రోగులకు తప్పని డోలీ ఇక్కట్లు

ప్రజాశక్తి -అనంతగిరి:గుమ్మ పంచాయతీ కరిగోడ గ్రామాల రోగులకు డోలీ కష్టాలు తప్పడం లేదు. నెల రోజులు వ్యాధిలోనే ఇద్దరు గర్భిణీలు డోలి సహాయంతో వైద్య సేవల కోసం వెళ్లవలసి వచ్చింది. గత వారం క్రితం అనారోగ్యంతో బాధపడుతున్న ఎస్. లచ్చన్నను డోలి సహాయంతో తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందిన ఘటన తెలిసిందే. ఈ ఘటన మరువక ముందే బడ్నాయిని. కుమారి అనే గిరిజనుడు వాంతులు విరోచనాలతో బాధపడుతుండగా బుధవారం కుటుంబ సభ్యులు స్వగ్రామం నుండి కొండ కోనల అటవీ మార్గం గుండా సుమారు 6 కిలోమీటర్ల డోలి సహాయంతో నిమ్మ ఊట గ్రామానికి తరలించి అక్కడ నుండి ప్రైవేటు ఆటోలో ఎస్. కోట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి కుటుంబ సభ్యులు తరలించారు. సరైన రోడ్డు సౌకర్యం లేక పోవడంతోనే రోగులకు ఈ కష్టాలు రోజు రోజుకు ఎదురవుతున్నాయి. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం తక్షణమే స్పందించి నిలిచిన రోడ్డు పనులు ప్రారంభించాలని ఆ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

బస్కిలో పర్యటించిన అధికారులు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: మండలంలోని బస్కీ గ్రామాన్ని బుధవారం ఎంపీడీవో ఎల్ లవరాజు, వైద్య సిబ్బంది పర్యటించారు. బుధవారం గ్రామంలో 20 మంది చిన్నారులు విష జ్వరాలతో అరకు ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు వివిధ పత్రికల్లో వచ్చిన కథనానికి స్పందన లభించింది. అధికారులు, వైద్యులు గ్రామంలోకి వెళ్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు.ఎంపీడీఓ లవరాజు మాట్లాడుతూ గ్రామంలో విషజ్వరాలు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. వాటర్ ట్యాంక్ క్లీన్ చేసి మంచి నీరు అందించాలని సచివాలయం సిబ్బందికి సూచించారు. రెండు రోజులు మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి మెరుగైన వైద్యం అందించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సురేష్ కుమార్, సచివాలయ సిబ్బంది వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పూనెం ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

- సంస్మరణ సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి కిరణ్
- స్వగ్రామం నూతిగూడెంలో స్థూపం ఆవిష్కరణ

ప్రజాశక్తి-విఆర్.పురం

సిపిఎం సీనియర్ నాయకులు పూనెం సత్యనారాయణ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి కార్యకర్తా కంకణబద్ధులు కావాలని ఆ పార్టీ ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ పిలుపునిచ్చారు. పూనెం సత్యనారాయణ స్వగ్రామం మండలంలోని నూతిగూడెం గ్రామంలో ఏర్పాటు చేసిన ఆయన స్థూపాన్ని బుధవారం కిరణ్‌తో పాటు ఎపి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ తదితరులు ఆవిష్కరించారు. పూనెం సత్యనారాయణ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిపిఎం జెండాను ఆ పార్టీ మండల కార్యదర్శి సోయం చిన్నబాబు ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సంస్మరణ సభలో కిరణ్ మాట్లాడుతూ పూనెం సత్యనారాయణ మరణం పార్టీకి, ప్రజా ఉద్యమాలకు తీరని లోటన్నారు. ప్రజా సమస్యలపై ఆయన అనేక ఉద్యమాలు చేశారని గుర్తు చేశారు. మండల అభివృద్ధికి, పార్టీ బలోపేతానికి పూనెం సత్యనారాయణ చేసిన కృషి మరువలేనిదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఎఐటియుసి నాయకురాలు సిహెచ్.సీతామహాలక్ష్మి, సిఐటియు జిల్లా అధ్యక్షులు మట్ల వాణిశ్రీ, ఎంపీపీ కారం లక్ష్మి, మాజీ ఎంపీపీ సున్నం నాగమ్మ, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సీసం సురేష్, విఆర్.పురం మండల నాయకులు పంకు సత్తిబాబు, కారం సుందరయ్య, వడ్లాది రమేష్, పులి బుజ్జి, కుంజ నాగిరెడ్డి, జి.లక్ష్మణరావు, సర్పంచులు పులి సంతోష్ కుమార్, కారం బుచ్చమ్మ, వెట్టి లక్ష్మి, సిఐటియు మోతుగూడెం నాయకులు చింత రాంబాబు, బీవీ రమణ, బంధుమిత్రులు పాల్గొన్నారు.

పూనెం సత్యనారాయణ స్థూపాన్ని ఆవిష్కరించి నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు, స్థానికులు

వరికి గిట్టుబాటు ధర లేక రైతుల ఆందోళన

గతేడాది కంటే తగ్గిన ధర

ప్రజాశక్తి-దేవీపట్నం

ఖరీఫ్ సీజన్లో రైతులు కష్టంచి పండించిన వరి ధాన్యానికి సరైన గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మండలంలోని ఇందుకూరుపేట పరిసర ప్రాంతాల్లో ఈ సీజన్లో రైతులు విరివిగా వరి సాగును చేపట్టారు. ధాన్యం చేతికొచ్చే సరికి అటు కొనుగోలు లేక బయట మార్కెట్‌లో సరైన గిట్టుబాటు ధర లేక కారుచౌకగా దళారులకు అమ్ముకోలేక రైతులు విలవిలాడుతున్నారు. గత సంవత్సరం పచ్చి ధాన్యం క్వింటాల్ రూ.1650 ఉండగా సన్నరకం 75కేజీలు రూ.2000 ఉండేది. కాని ఈ సంవత్సరం మామూలు రకం రూ.1450, సన్నరకం రూ.1700 మాత్రమే దళారులు ధర ప్రకటించి రైతుల కష్టాన్ని దోచుకుంటున్నారని ఇందుకూరుపేటకు చెందిన రైతులు తంతపురెడ్డి వీర రాఘవులు, పాతాల సూరిబాబు, మట్టా వీరబాబు, కేతమళ్ళ దొరబాబు, కొత్తపల్లి జయరావు, తంతపు రెడ్డి నాని తదితరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం హయాంలో రైతు భరోసా కేంద్రాలు ద్వారా రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర ప్రకటించి ప్రభుత్వమే నేరుగా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసేదని, నేడు టిడిపి కూటమి ప్రభుత్వం ఇంతవరకు పండించిన పంటలకు గిట్టుబాటు ధర ప్రకటించక పోవటం సరికాదని రైతులు వాపోతున్నారు. సుమారు 1500 క్వింటాళ్ళ ధాన్యం కళ్లాలపై ఉండగా వాతావరణంలోని మార్పులతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించాలని గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతులు

జిఓ 3 పునరుద్ధరణపై స్పష్టతివ్వకుంటే అసెంబ్లీ ముట్టడి

ప్రజాశక్తి-విఆర్.పురం

జిఓ నెంబర్ 3 పునరుద్ధరణపై టిడిపి కూటమి ప్రభుత్వం స్పష్టత ఇవ్వకుంటే అసెంబ్లీని ముట్టడిస్తామని ఆదివాసీ నిరుద్యోగ జెఎసి నాయకులు సోచి చందు హెచ్చరించారు. మండలంలోని తెల్లవారిగూడెంలో గ్రామస్తులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీవో నెంబర్ 3 రద్దు కావడం వల్ల ఆదివాసీ యువతీ యువకుల భవితవ్యం అగమ్యగోచరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి వస్తే జీవో నెంబర్ 3ను పునరుద్ధరిస్తామని అరకు జరిగిన ఎన్నికల బహిరంగ సభలో హామీ ఇచ్చిన చంద్రబాబు నాయుడు నేడు ఆ హామీని గాలికొదిలేసి మౌనం వహించడం సరికాదన్నారు. జిఓ 3పై ఇప్పటికే ఆదివాసీ నిరుద్యోగులు గిరిజన ఎమ్మెల్యేలకు, గిరిజన శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణికి, ఐటిడిఎల పిఒలు, జిల్లా కలెక్టర్‌కు విన్నవించామని, కాని ఇప్పటి వరకు ప్రభుత్వం దీనిపై స్పష్టత ఇవ్వకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఆదివాసీల ఓట్లతో గద్దెనెక్కిన ఎమ్మెల్యేలు కూడా ఆదివాసీ హక్కులపై గళం విప్పట్లేదని, అందువల్ల ఆదివాసీ సమాజమంతా ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం వెంటనే జీవో నెంబర్ 3ను పునరుద్ధరించాలని, ప్రభుత్వం ప్రకటించే మెగా డీఎస్సీలో ఏజెన్సీ పోస్టులన్నీ ఆదివాసీ అభ్యర్థులతోనే భర్తీ చేయాలని, ప్రత్యేక ఏజెన్సీ డీఎస్సీ ప్రకటించాలని, ఆదివాసీ చట్టాలు పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బంధం రాజు, నిరుద్యోగులు పులి అశోక్, ముత్యాల రెడ్డి, విశ్వంత్ కుమార్, తెలవారిగూడెం గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

తెల్లవారిగూడెం గ్రామస్తులతో మాట్లాడుతున్న నిరుద్యోగ జెఎసి నాయకులు

విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఆపండి : సిపిఎం

ప్రజాశక్తి-పాడేరు : విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని సిపిఎం అల్లూరి జిల్లాకార్యదర్శి పి.అప్పలనరస డిమాండ్ చేశారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలోని పలు జిల్లాలలో ప్రభుత్వ కార్యాలయాలకు ముందుగా ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగించిందన్నారు. ప్రస్తుతం చిన్న, మధ్యతరగతి వ్యాపార సంస్థలతో సహా అందరికీ స్మార్ట్ మీటర్లు పెడుతున్నారని చెప్పారు. నివాస గృహాలకు మీటర్లు పెట్టడానికి సన్నాహాలు చేస్తున్నారని తెలిపారు. వైసిపి ప్రభుత్వం పంపుసెట్లకు మీటర్లు బిగించినప్పుడు ప్రతిపక్షంలో ఉండగా తెలుగుదేశం, జనసేన పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించాయని గుర్తు చేశారు. అప్పుడు ఆ పార్టీల నేతలు మీటర్లు పగలగొట్టాలని పిలుపునిచ్చారని తెలిపారు. కూటమి ప్రభుత్వం మాట తప్పి మీటర్లు పెడుతున్నారని కొనసాగిస్తూ ప్రతి కనెక్షన్ కు స్మార్ట్ పెట్టడం నష్టం ద్రోహమేనన్నారు. మరోవైపు ప్రతి మీటర్‌కు అయ్యే వ్యయం 96 నెలల పాటు వాయిదా పద్ధతిలో వేలాది రూపాయలను వినియోగదారుల నుండే వసూలు చేస్తారన్నారు. ఉచిత విద్యుత్ ను దశలవారీగా తొలగించడానికి ఈ స్మార్ట్ మీటర్ల విధానాన్ని తీసుకు వచ్చారని విమర్శించారు. ప్రభుత్వం ఇప్పటికైనా పునరాలోచన చేయాలన్నారు. స్మార్ట్ మీటర్ల ట్రూ అప్ చార్జీలకు వ్యతిరేకంగా వామపక్షాల పిలుపు మేరకు జరిగే ఆందోళనలలో భాగస్వాములు కావాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

అనంతగిరిలో మాట్లాడుతున్న ఎంపిడిఒ

గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు

ప్రజాశక్తి - చింతపల్లి: ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల ఉద్యోగులకు జిపిడిపి శిక్షణ తరగతులు ఎంతగానో దోహదపడతాయని స్థానిక ఈవోపిఆర్ డి శ్రీనివాసరావు అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన రెండు రోజుల శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, పంచాయతీలకు వచ్చే నిధులతో గ్రామాలలో ఏ విధమైన అభివృద్ధి పనులు చేపట్టాలనే విషయమై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీపీ కోరాబు అనూష దేవి, జడ్పిటిసి సభ్యుడు పోతురాజు బాలయ్య, వైస్ ఎంపీపీలు గోపి నాయక శారద, సాగిన వెంగళరావు, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షురాలు దురియ పుష్పలత, వివిధ పంచాయతీల సర్పంచ్లు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

అనంతగిరి: పంచాయతీల అభివృద్ధికి ప్రణాళిక రూపొందించాలని ఎంపీడీవో ఏవివి కుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో శిక్షణకు మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు,. సర్పంచులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ ఏఈ, ఉపాధి హామీ ఏపీఓ నాయుడు, పలు శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు

20 గృహాలు మంజూరు

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండలంలో కే.కోడపల్లి పంచాయతీ పరదేశిపుట్టు గ్రామంలో పీఎం జన్మన్ పథకం కింద సుమారు 20 ఇళ్లు మంజూరైనట్టు గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ బి.బాబు తెలిపారు. బుధవారం ఆ గ్రామంలో గృహ నిర్మాణాల పనులను చేపట్టారు. త్వరగా నిర్మాణ పనులు పూర్తి చేస్తే బిల్లులు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జేఈ ఈశ్వరరావు, గ్రామస్తులు పాల్గొన్నారు

పనులు ప్రారంభిస్తున్న పీడీ బాబు

అధిక ధరలపై అదుపు ఏదీ?

ప్రజాపోరులో సిపిఎం నేతలు

చింతపల్లిలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి - చింతపల్లి : ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అధిక ధరలపై మాట్లాడిన తెదేపా అధినేత చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చాక ఆ విషయమై నోరు మెదపకపోవడంలో విడ్డూరంగా ఉందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బోనంగి చిన్నయ్య పడాల్ విమర్శించారు. పార్టీ నాయకులతో కలిసి ధరలపై ప్రజాపోరు గోడ పత్రికను బుధవారం చింతపల్లిలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, టిడిపి, బిజెపి, జనసేన కూటమి ప్రభుత్వం అధికారంలో రాగానే పేదలపై ధరల భారాన్ని తగ్గిస్తామని చెప్పి, ప్రస్తుతం విపరీతమైన భారం మోపుతుందని మండిపడ్డారు. పేదలకు ఆదాయం పెంచడానికి ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. చిన్న చిన్న రోగాలకే ప్రాణాలు కోల్పోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన యువతి, యువకులకు ఉపాధి లేకపోవడంతో నిరుద్యోగ సమస్య పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పాంగి ధనుంజయ్, నాయకులు సాగిన చిరంజీవి, మజ్జి రాంబాబు, రామకృష్ణ పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు : లక్ష్మీపురం పంచాయితీ కార్యాలయం వద్ద సిపిఎం మండల కమిటీ సభ్యుడు నీలకంఠం ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉచిత ఇసుక అందించి పీఎం జన్ మన్ గృహాలకు ఐదు లక్షల మంజూరు చేయాలని కోరారు. సిపిఎం మండల కార్యదర్శి సర్పంచ్ కొర్రా.త్రినాథ్ మాట్లాడుతూ, గతంలో మంజూరు అయిన ఎన్టీఆర్, పీఎం యోజన ఇల్లులకు ప్రస్తుతం ఉన్న ధరలకు అనుగుణంగా 5 లక్షలు ఇవ్వాలనీ డిమాండ్ చేశారు. గురువారం తహసీల్దార్ కార్యాలయం ముందు చేపట్టే నిరసన కార్యక్రమంలో అధిక సంఖ్యలో గిరిజనులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు టి.గోపాల్, సభ్యులు వి.నీలకంఠం, హరి, మల్లేష్, శుక్రన్న పాల్గొన్నారు.

యుటిఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక

అధ్యక్షులు ఈశ్వరరావు

ప్రధాన కార్యదర్శి మల్లేశ్వరరావు

ప్రజాశక్తి -అనంతగిరి: శివలింగపురం బాలుర పాఠశాల వద్ద బుధవారం యుటిఎఫ్ మండల కార్యవర్గం ఎన్నికైంది.యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు గుడిగి. దేముడు ఆధ్వర్యన ఎన్నిక ఇకగ్రీవంగా జరిగింది. మండల అధ్యక్షులుగా వి.వి. ఈశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా నరాజీ. మల్లేశ్వరరావులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మల్లేశ్వరరావు మాట్లాడుతూ, నూతనంగా ఎన్నికైన ప్రతినిధులు ఉపాధ్యాయ ఫెడరేషన్ నియమ నిబంధనలను అనుగుణంగా పని చేసి ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ ఉమ్మడి జిల్లా సహా అధ్యక్షులు శెట్టి. రాంబాబు, మండల పూర్వ ప్రధాన కార్యదర్శి బి. సింహాచలం, ప్రతినిధులు బిఎస్ఎన్ .పడల్, కె రఘు, మహిళ విభాగం నాయకురాలు వి వి ఉషారాణి, ప్రతినిధులు విజయ్ కుమార్, ఎస్. గంగరాజు, కొండబాబు, బాలకృష్ణ, నారాయణ, కృష్ణ, సుబ్బారావు, ప్రసాద్, నాగేశ్వరరావు, దేముడు, సుదారాణి తదితరులు పాల్గొన్నారు

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ

ప్రజాశక్తి -చింతపల్లి: మొక్కలను నాటితే పర్యావరణాన్ని పరిరక్షించుకోగలమని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సేగ్గే కొండలరావు అన్నారు. సిపిఐ మండల కార్యదర్శి పేట్ల పోతురాజు అధ్యక్షతన బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వృక్ష సంపద పెంపకం ద్వారా కాఫీ, మిరియాలు సాగును మరింత ప్రోత్సహించ వచ్చున్నారు. గిరిజనులు ఆర్థికంగా నిలదొక్కు కోవాలంటే అటవీ సంపదే ఆధారం అన్నారు. ఈ కార్యక్రమంలో అంజలి శనివారం పంచాయితీ సర్పంచ్ పేట్ల రాజబాబు, ఎర్ర బొమ్మల ఎంపీటీసీ సభ్యుడు ఎస్ సత్తిబాబు, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఇరువాడ దేముడు, గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు డి సతీష్, మండల సమితి సభ్యుడు జి కామేశ్వరరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కొండలరావు

దొన్ను దొరకు స్వాగతం పలుకుతున్న టిడిపి శ్రేణులు

దొన్ను దొరకు ఘన స్వాగతం

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలోని కాశీపట్నం గ్రామంలో విజయనగరం ఆర్టీసీ బోర్డు చైర్మన్‌గా నియమితులైన దొన్నుదొర బుధవారం పర్యటించారు. టిడిపి శ్రేణులు స్వాగతం పలికారు. కాశీపట్నం తలుపులమ్మ గుడిలో పూజలు చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు ఆర్టీసీ సేవలు మరింతగా అందించేందుకు కృషి చేస్తానన్నారు ఈ కార్యక్రమంలో ఎంపిటిసి మాతలయోగి సన్యాసిరావు, టిడిపి నాయకులు పుష్పానందం, నరేష్, దేవి పాల్గొన్నారు

కోరాపుట్-జగదల్‌పూర్ సెక్షన్‌లో డిఆర్ఎం తనిఖీలు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ: కోరాపుట్-జగదల్పూర్ సెక్షన్‌లో డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ బుధవారం తనిఖీ చేశారు. భద్రతను పెంచడం, సౌకర్యాలను మెరుగుపరచడం, డబుల్ లైన్ పనులతో సహా కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. సివిల్ ఇంజినీరింగ్, ఆపరేషన్స్, ఎలక్ట్రికల్, సిగ్నల్ అండ్ టెలికాం, కమర్షియల్ అండ్ సేఫ్టీ తదితర విభాగాలకు చెందిన సీనియర్ అధికారులతో కలిసి డిఆర్ఎం పరిశీలించారు. డిలిమిలి, దంతెవారా స్టేషన్లను సందర్శించిన ఆయన సౌకర్యాలు, సిబ్బంది క్వార్టర్లు, సరుకు నిర్వహణ, మౌలిక సదుపాయాలు, ప్రయాణికుల సౌకర్యాలను మెరుగుపరచడంపై పలు సూచనలు చేశారు. అనంతరం లెవల్ క్రాసింగ్ గేట్ కెకె-103 వద్ద, డిఆర్ఎమ్ సమగ్ర భద్రతా ఆడిట్ నిర్వహించారు

స్వాట్‌ను ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి - అనకాపల్లి : కార్మిక పోరాటాల అణచివేతకై ఉద్దేశించిన స్వాట్‌ను ప్రభుత్వం ఉపసంహరించాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.శంకరరావు, జి.కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అడిగర్ల రాజు డిమాండ్ చేశారు. అనకాపల్లిలోని సిఐటియు కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ, కార్మికుల ఆందోళనలను అణిచి వేయడానికి అనకాపల్లి జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ప్రత్యేక దళాన్ని (స్వాట్) ఏర్పాటు చేయడమంటే నిరంకుశ చర్యలకు దారి తీయడమే అన్నారు. ప్రజాస్వామ్య దేశంలో కార్మికులు, ప్రజలు తమ సమస్యలపై నిరసన తెలియజేసే హక్కు ఉందన్నారు. దీనికి భిన్నంగా ఉగ్రవాదులను అణచి వేసేటట్టు కార్మిక పోరాటాలని అణచడానికి స్వాట్ దళాన్ని 30 మందితో ఏర్పాటు చేయడం, ప్రత్యేక శిక్షణ ఇవ్వడం తగదన్నారు. రాష్ట్రంలో పరిశ్రమలు రావడానికి ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం అనేక రాయితీలను ప్రకటించి, ప్రభుత్వ ఆస్తులను కట్టబెడుతోందన్నారు. వచ్చిన కంపెనీలు కార్మికుల చట్టాలు అమలు చేయకుండా, తమ ఇష్టం వచ్చినట్టు వ్యవహరిస్తున్నాయని, ప్రశ్నించే కార్మిక వర్గాల గొంతు నొక్కడానికి ఈ స్వాట్ దళం పనిచేసేటట్టు జిల్లా ఎస్పీ ప్రకటించడం దుర్మార్గం అని పేర్కొన్నారు. జిల్లాలోని పారిశ్రామిక వాడల్లో నిత్యం అనేక ప్రమాదాలు చోటు చేసుకోవడం, కనీస వేతనాలు లేకపోవడంతో కార్మికులు దోపిడీకి గురవుతున్నారని తెలిపారు. వీటిపై కార్మికులకు భద్రత, రక్షణ కల్పించకుండా తమకు భద్రత కావాలని అడిగే వారిని ఈ స్వాట్ టీమ్స్ ద్వారా అణచివేయాలని చూడటం దారుణం అన్నారు. పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగినప్పుడు కార్మిక సంఘాలు, కార్మికులు పోరాడితేనే ఆ కుటుంబాలకు సరైన పరిహారం అందుతుందన్న విషయాన్ని గుర్తుచేశారు. ఇప్పుడు అది కూడా లేకుండా చేయడానికి స్వాట్ టీములు నియమిస్తే కార్మికులను ఎవరు ఆదుకుంటారని ప్రశ్నించారు. బడా కార్పొరేట్లను, పెట్టుబడిదారులను సంతృప్తి పరచడానికే ఈ పోలీసులను వినియోగిస్తున్నట్లు కనిపిస్తుందన్నారు. స్పీడ్ ఆఫ్ బిజినెస్ పేరుతో యజమానులకు లాభాలను తెచ్చిపెట్టే ధోరణితో కాకుండా లక్షలాదిమంది కార్మికుల కోసం ప్రభుత్వం పనిచేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ హక్కులను హరించే విధంగా ఈ స్వాట్ టీమ్‌ను నియామకం జరిగినట్లు భావిస్తున్నామన్నారు. కార్మికులు తమ సమస్యల పరిష్కారానికి పోరాటాలు నిర్వహిస్తారు తప్ప కావాలని ఎవరూ ఆందోళనలు చేయరని గుర్తించాలని హితవుపలికారు. ఇటువంటి దళాలను ఏర్పాటు చేయడం సరి కాదన్నారు. వెంటనే ఈ దళాన్ని ఉపసంహరించాలని డిమాండ్‌చేశారు.

గ్రామ వాలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి- దేవీపట్నం : ఎన్నికల ముందు చంద్రబాబునాయుడు గ్రామ వాలంటీర్లకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని, గ్రామ వాలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ వాలంటీర్లకు రూ.10వేలు గౌరవ వేతనం ఇచ్చి మరల విధుల్లోకి తీసుకుంటామని ఇచ్చిన హామీ ప్రకారం వారికి న్యాయం చేయాలని కోరారు. ప్రభుత్వం విధుల్లోకి తీసుకుంటుందని ఎన్నో ఆశలతో ఎదురుచూసిన వాలంటీర్లు ప్రభుత్వం నుండి స్పందన లేకపోవడంతో హైదరాబాద్, విజయవాడ, రాజమహేంద్రవరం, కాకినాడ వంటి ప్రాంతాలకు రోజు వారీ కూలి పనులకు వెళ్తున్నారని పేర్కొన్నారు. అక్కడ అనేక మానసిక ఇబ్బందులు పడుతూ అనారోగ్యాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ వార్డు వాలంటీర్లకు తక్షణమే విధుల్లోకి తీసుకొని ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు జేఏసీ నాయకులు కారం రామన్న దొర, యలగాడ నాగేశ్వరావు పాల్గొన్నారు.

వ్యవసాయ మోటారు వితరణ

వ్యవసాయ మోటారును వితరణగా అందజేస్తున్న జెకెసి ట్రస్ట్ ప్రతినిధులు

ప్రజాశక్తి-విఆర్.పురం : మండలం రామవరం గ్రామానికి చెందిన వ్యవసాయ మోటారు బోర్డు మరమ్మతులకు గురికావడంతో, జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్టు తరుపున రూ.60వేలు విలువైన మోటారు బోరును బుధవారం అందించారు. రైతుల సమస్యలను తెలుసుకొని అడిగిన వెంటనే మోటారు బోర్డు అందించిన ఆయుర్వేద వైద్యులు జమాల్ ఖాన్‌కు రైతులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామవరం గ్రామస్తులు గొర్రె రామారావు, కోర నాగేశ్వరరావు, బొగ్గ సీతారాములు, గొర్రె రాజు, కూర బిక్షం, గొర్రె శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయికి దూరంగా ఉండాలి

మాట్లాడుతున్న ఎస్ఐ రవీంధ్ర

ప్రజాశక్తి-సీలేరు : గంజాయి సాగు, రవాణా చట్టరీత్యా నేరమని, వాటికి దూరంగా ఉండాలని సీలేరు ఎస్ఐ కె.రవీంద్ర అన్నారు. జీకే వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ వలసగెడ్డ గ్రామాన్ని బుధవారం ఆయన సందర్శించి, గిరిజన యువతీ యువకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి మత్తుకు ఎవరూ బానిసలు కావద్దని, మంచి మార్గంలో నడవాలని సూచించారు. గంజాయి సాగు, అక్రమ రవాణాకు పాల్పడితే కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వినియోగించాలన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సైబర్ నేరాలు పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

విజ్ఞానదాయకంగా బాలల సైన్స్ కాంగ్రెస్

ఆసక్తి రేకెత్తిస్తున్న శాస్త్రవేత్తల ప్రసంగాలు

చిత్రకళా ప్రదర్శనను తిలకిస్తున్న చిన్నారులు

ప్రజాశక్తి -మధురవాడ : బాలలలో శాస్త్ర విజ్ఞానం పట్ల ఆసక్తిని పెంచడానికి, నూతన ఆలోచనలను ప్రోత్సహించడానికి జవహర్ నవోదయ విద్యాలయ సమితి(జెఎన్‌వి) ఆధ్వర్యంలో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా నిర్వహిస్తున్న జరుగుతున్న ప్రాంతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ విద్యార్థులలో స్ఫూర్తిని నింపుతోంది. ముఖ్యంగా సముద్ర శాస్త్ర వింతలు, విశేషాల నుంచి నానో సైన్స్, కృత్రిమ మేధ వరకు శాస్త్రవేత్తల ప్రసంగాలను ఏర్పాటు చేయడంతో విజ్ఞానదాయకంగా సైన్స్ కాంగ్రెస్ కొనసాగుతోంది. గీతంలో జరుగుతున్న సైన్స్ కాంగ్రెస్‌లో బుధవారం జరిగిన శాస్త్రవేత్తల ప్రసంగాలు, విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయడం ఆసక్తికరమైన చర్చలకు వేదికగా మారింది.

ఎన్ఐఒ శాస్త్రవేత్త డాక్టర్ వివిఎస్ఎస్.శర్మ తన ప్రసంగంలో సముద్రాలలోని జీవరాశులు వాటిలో ఔషధ గుణాలు, సముద్ర గర్భంలో లభించే ఖనిజాలు, సముద్ర అలల నుంచి విద్యుత్తు ఉత్పాదన వంటి అంశాలను విద్యార్థులకు వివరించారు. వాతావరణంలో వస్తున్న మార్పులు ముఖ్యంగా ప్రపంచ ఉష్ణోగ్రతల పెరుగుదల ప్రభావం సముద్రంపై ఎలా ఉంటుందో తెలియజేశారు. తుఫానులను ముందుగా గుర్తించడం, తీర ప్రాంత కాలుష్యం తీసుకోవలసిన జాగ్రత్తలను ఆసక్తిరంగా వివరించారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్, శాంతి స్వరూప్ భట్నాగర్ అవార్డు గ్రహీత ప్రముఖ భూభౌతిక శాస్త్రవేత్త ప్రొఫెసర్ కె.ఎస్.కృష్ణ ఒకప్పుడు కలిసి ఉన్న భూభాగం ఖండాలుగా విడిపోవడానికి దారితీసిన పరిస్థితులను వెల్లడించారు.సముద్ర లోతులలోఅధిక ఉష్ణోగ్రతల వద్దజీవరాశుల ఉనికిని వివరించే విశేషాలను వివరించారు.

. భారత ప్రభుత్వం త్వరలో ప్రారంభించనున్న సముద్రయాన్ ప్రాజెక్టు విశేషాలను వెల్లడిరచారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, రసాయన శాస్త్ర విభాగం అధిపతి ప్రొఫెసర్ ఎన్‌వివిఎస్.వేణుగోపాల్ నానో సైన్స్ విశేషాలను వివరిస్తూ వ్యవసాయ రంగంలో అధిక దిగుబడులు సాధించడానికి నానో టెక్నాలజీ ఉపయోగ పడనున్నదని తెలిపారు. భవిష్యత్తులో నానో క్రిమిసంహరకాలు, ఎరువులు అందుబాటులోకి రానున్నాయని అలాగే నీటి నాణ్యత, ఆహార భద్రతలో సహితం నానో టెక్నాలజీ ఉపయోగించనున్నట్లు వివరించారు.

కృత్రిమ మేధ సమీప భవిష్యత్తులో వివిధ రంగాలను ఏవిధంగా ప్రభావితం చేయనున్నదో గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.రవిశంకర్ వివరించారు. గీతం జీవ శాస్త్ర విభాగాల డైరక్టర్ ప్రొఫెసర్ ఎస్.శ్రీనివాస్ పట్టణ వ్యర్థాల శుద్ధి, పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను వివరించారు. ఈ నెల 15వ తేదీ వరకు కొనసాగనున్న బాలల సైన్స్ కాంగ్రెస్‌లో దక్షిణ భారత దేశంలోని ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, కర్ణాటక, కేరళ రాష్ట్రాల నుంచి జవహర్ నవోదయ విద్యాలయాల విద్యార్థులు, అధ్యాపకులు, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

న్యుమోనియాను నిర్లక్ష్యం చేయొద్దు : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి- సీతమ్మధార : పిల్లలో న్యుమోనియా లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజల్లో అవగాహనకు ఈనెల 12 నుంచి ఫిబ్రవరి 28 వరకు సాన్స్ ప్రోగ్రాం నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్.పి.జగదీశ్వరరావు తెలిపారు. బుధవారం డిఎంహెచ్ఒ కార్యాలయంలో దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్లను జిల్లా ప్రోగ్రాం అధికారుల సమక్షంలో డిఎంహెచ్ఒ ఆవిష్కరించారు. దగ్గు, జలుబు, అధిక జ్వరం, శ్వాస తీసుకోవడానికి ఇబ్బందులు, శ్వాస సమయంలో డొక్కలు ఎగురవేయటం వంటి లక్షణాలుంటే వెంటనే సమీప ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించుకుని మందులు వాడడం అవసరమన్నారు. పిల్లల్లో న్యుమోనియాను నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకమౌతుందన్నారు. డిఐఒ. డాక్టర్.ఎస్.జీవనరాణి, మాట్లాడుతూ న్యుమోనియా నుంచి రక్షణకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు.కార్యక్రమంలో డిఎల్‌టిఒ డాక్టర్ .పూర్ణేంద్ర బాబు, డిఐఒ ఎస్.జీవనరాణి, డిపిఎంఒ .బి.ఉమావతి, ఆర్‌బిఎస్‌కె డా.ఎన్.వి.సమత, జిల్లా సమన్వయకర్త, బి.నాగేశ్వర రావు, డెమో, తులసి, డిఎంఒ డా.జగదీష్ ప్రసాద్, డిఎస్ఒ డా.నళిని, మెడికల్ ఆఫీసర్, డిపిహెచ్ఎన్ఒ మనోరమ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం దుకాణం తరలించాలని ఆందోళన

ప్రజాశక్తి -మాధవధార : జివిఎంసి 50వ వార్డు మాధవధారలో బస్‌స్టాండ్ సమీపంలో పలు ప్రభుత్వ పాఠశాలలకు చేరువలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని వెంటనే తరలించాలని కోరుతూ మాధవధార ప్రాంతవాసులు ప్లకార్డులతో నిరసన చేపట్టారు. మద్యం దుకాణానికి దగ్గరగా జివిఎంసి హైస్కూలు, గాయత్రి విద్యామందిర్ ప్రైవేట్ స్కూలు ఉండడంతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితులు ఉన్నాయన్నారు.

అలాగే బస్‌స్టాప్‌కు అత్యంత చేరువలో మద్యం దుకాణం ఏర్పాటుతో మద్యం మత్తులో మందుబాబుల వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని వెంటనే జనావాసాలకు దూరంగా మద్యం దుకాణాన్ని తరలించాలని కోరారు. ఆందోళనలో మాధవధార ప్రజలు పప్పల రామచంద్రరావు, కూన సత్యనారాయణ, సనపల శ్రావణ్‌కుమార్, తర్లంగి ధర్మారావు, బొడ్డేపల్లి రమేష్‌కుమార్, సనపల ధనుంజయస్వామి, నూకరాజు, కూన పార్వతీ, పప్పల శ్రీదేవి గ్రామస్తులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి- సీతమ్మధార : విజయవాడ వరద సమయంలో విశేషసేవలు అందించిన జివిఎంసి 46వ వార్డు పారిశుధ్య కార్మికులకు బుధవారం జివిఎంసి ఆధ్వర్యంలో నూతన దుస్తులను డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ అందజేశారు. ఈ సందర్భంగా వరదలతో తీవ్ర ఇబ్బందికర పరిస్థితుల్లో ఉన్న బాధితులకు శానిటేషన్ సిబ్బంది అందించిన సేవలు ఎంత చెప్పినా తక్కువేనన్నారు.ఈ సందర్భంగా వారి సేవలను కొనియాడారు. జివిఎంసి నిధులతో ఒక్కొక్కరికీ రెండు జతల దుస్తులు అందజేసి, సత్కరించారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యుడు సేనాపతి అప్పారావు, కె,చిన్నా, సోమునాయుడు, వార్డు ఇన్స్పెక్టర్ సత్యం , సచివాలయ సెక్రటరీ రమేష్ ,వార్డు సూపర్వైజర్లు రామారావు, పాల్గొన్నారు

భీమునిపట్నం : విజయవాడలో వరద సహాయక చర్యల్లో పాల్గొన్న పారిశుధ్య కార్మికులకు, జివిఎంసి ఒకటో జోన్ కార్యాలయంలో జెడ్‌సి పిల్లి ప్రేమ ప్రసన్నకుమారి బుధవారం దుస్తులు పంపిణీ చేశారు.మహిళకు రెండు చీరలు, కార్మికునికి రెండు జతల దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు అక్కరమాని రామునాయుడు, మాజీ కౌన్సిలర్ గంటా నూకరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి మహాలక్ష్మి నాయుడు పాల్గొన్నారు

భూ వివాదాలు లేకుండా చూసుకోవాలి

గ్రామసభలో మాట్లాడుతున్న రెవెన్యూ అధికారులు

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని చిట్టెంపాడు పంచాయితీ పరిధి గోపవరం గ్రామంలో రీ సర్వేపై రైతులకు అవగాహన కల్పించారు. ముందుగా సచివాలయం విఆర్ఒ మధుబాబు, సర్వేయర్ రాజేష్ మాట్లాడుతూ సాగు చెసుకుంటున్న రైతులు సర్వే నెంబర్లు, పేర్లు మార్పులు, చనిపోయి ఉంటే పేర్లు మార్పు ఇలా అన్నింటిని సరి చూసుకొని భూ వివాదాలు లేకుండా చేసుకోవాలని సూచించారు. భూ హక్కుదారుడు తప్పనిసరిగా దగ్గరుండి చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో గాంధీ, దారబాబు, కిరణ్, కొండలరావు, అప్పన్నబాబు, బాబురావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నొప్పులకు లయన్స్ ఆసుపత్రిలో శాశ్వత నివారణ

ప్రజాశక్తి- సీతమ్మధార : నగరంలోని బాలయ్య శాస్త్రి లేఅవుట్‌లోని లయన్స్ కేన్సర్ జనరల్ ఆసుపత్రిలో మెడనొప్పి , వెన్నెముక నొప్పి, కేన్సర్ నిర్వహణకు సిఆర్మ్ ఫ్లోరోస్కోపీ, హైడెఫినిషన్ అల్ట్రాసోనోగ్రఫీని ఉపయోగించి చికిత్స ద్వారా మొదటి ప్రయత్నంలోనే నూరుశాతం నివారణ ద్వారా రోగికి పూర్తి ఉపశమనం కలిగించేలా వైద్యసేవలు అందిస్తున్నామని ఆసుపత్రి మేనేజింగ్ ట్రస్టీ, ప్రొఫెసర్ డాక్టర్ వెలగపూడి ఉమామహేశ్వరరావు అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అమెరికన్ బోర్డ్ ఆఫ్ మెడికల్ స్పెషాలిటీస్ మార్గదర్శకాల ప్రకారం వెన్నెముకలో స్టెరాయిడ్, అనస్తీటిక్ ఎపిడ్యూరల్ బ్లాక్‌లు, న్యూరోయాక్సియల్ బ్లాక్‌లు, ఫేసెట్ జాయింట్ బ్లాక్‌లు, కండరాల నొప్పిని తగ్గించడం మామూలు స్థితికి చేరుకునేలా రోగులకు విజయవంతంగా చికిత్స చేస్తామన్నారు. అన్ని కీళ్ల నొప్పులకు అనుభవజ్ఞులైన డాక్టర్ గౌరీభవన్ పోథిని పర్యవేక్షణలో ఎమర్జెన్సీ, క్రిటికల్ కేర్ మెడిసిన్, ఇంటర్వెన్షనల్ పెయిన్ మేనేజ్‌మెంట్ జనరల్ ప్రాక్టీస్‌లో బాగా శిక్షణ పొందిన వైద్యుల ద్వారా చికిత్సలను అందిస్తున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు తమ ఆసుపత్రి వెబ్‌సైట్ www.lionscancerhospital.org వెబ్‌సైట్‌ను సంప్రదించాలని, అపాయింట్‌మెంట్ కోసం 95604 47813 నెంబర్‌కు కాల్ చేయాలని సూచించారు.

వేతన బకాయి చెల్లించాలని ధర్నా

ప్రజాశక్తి- గాజువాక : కాంట్రాక్టు కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లింపు, బకాయి పడ్డ ఏడు నెలల జీతాల చెల్లింపు, ఉపాధి కోల్పోయిన వారికి ఉపాధి కల్పన, నిర్వాసితులకు శాశ్వత ఉపాధి కల్పించాలని కోరుతూ. ఉక్కు అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘాలు ఆధ్వర్యంలో బుధవారం బిసి గేటు వద్ద. ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టు లేబర్ యూనియన్, సిఐటియు అధ్యక్షులు. జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ. ఉక్కు యాజమాన్యం నిర్లక్ష్యం వల్ల టెండర్లు సకాలంలో పూర్తి కానందున సుమారు ఆరు వందల మంది కార్మికులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. టెండర్లు విధానంలో మార్పులు చేసి, ఒకే సంస్థకు ఏడు జోన్ లు ఇవ్వకుండా ఒక్కొక్కరికీ ఒక్కో జోన్ మాత్రమే ఇవ్వాలని కోరారు.. కార్మికులకు బకాయి పడ్డ ఆరేడు నెలల వేతనాలను కాంట్రాక్టర్లు చెల్లించకపోయినా స్టీల్‌ప్లాంట్ యాజమాన్యంలో స్పందన లేదన్నారు. యాజమాన్యం వైఖరిలో మార్పు రాకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు. నమ్మి రమణ, పి మసేను., సూర్య కుమార్, నందికి తాతారావు, కె వంశీ. యు అప్పారావు, పిట్ట రెడ్డి, శశిభూషణ్ మాట్లాడారు..

పార్కును అభివృద్ధి చేయాలని వినతి

ప్రజాశక్తి-విశాఖపట్నం : వివేకానందనగర్ పార్క్‌ను అభివృద్ధి చేయాలని కోరుతూ జివిఎంసి కమిషనర్ పి.సంపత్‌కుమార్‌కు నంద నగర్ కల్చరల్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు బుధవారం వినతిపత్రం అందించారు. వినతిపత్రం అందించిన వారిలో సొసైటీ సభ్యులు కెఆర్‌కె.మూర్తి, రాంబాబు, ఉదయ్, కోటేశ్వరరావు, శ్రీనివాసరావు, మురళీకృష్ణ, పాండురంగారావు, రాఘవ తదితరులు ఉన్నారు.

భారత తొలి ప్రధాని నెహ్రూ జయంతి

ప్రజాశక్తి
తెలుగు దినపత్రిక

విశాఖపట్నం గురువారం 14-11-2024 8 పేజీలు

ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణ ప్రత్యేక అనుబంధం

దేశానికి వెన్నెముక ప్రభుత్వ రంగం

నెహ్రూ విధానాల విశిష్టత

- ఎంవిఎస్.శర్మ

మోడీ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటినుంచీ, నెహ్రూ విధానాలను ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ దేశం వెనుకబడిపోడానికి ఆ విధానాలే కారణం అంటూ ప్రచారం చేస్తోంది. చివరికి చరిత్ర పుస్తకాల్లో సైతం నెహ్రూ ప్రస్తావన లేకుండా తుడిచేయడానికి పూనుకుంది. నెహ్రూ అనుసరించిన ఆర్థిక విధానాలను పూర్తిగా తిరగదోడినప్పుడే ప్రపంచబ్యాంక్, ఐఎంఎఫ్ ఆదేశిత దివాళాకోరు ఆర్థిక విధానాలను సమర్థించుకోవడం తేలికౌతుంది. అందుకే సంఘపరివార్‌కు నెహ్రూ అంటే ప్రత్యేకమైన ద్వేషం, అక్కసు.

ఇంతకూ నెహ్రూ ప్రభుత్వం అనుసరించిన విధానాలేమిటి ? వాటి విశిష్టత ఏమిటి ? నేటి పరిస్థితుల్లో వాటి ప్రాధాన్యత ఏమిటి ? అన్నది తెలుసుకోవడం చాలా అవసరం. నెహ్రూ జయంతి అంటే కేవలం చిన్న పిల్లల పండగ మాత్రమే కాదు. నెహ్రూ అనుసరించిన విధానాలు ప్రజాస్వామ్యం, లౌకికతత్వం, స్వావలంబన, సామాజిక న్యాయం వంటి మన రాజ్యాంగ మౌలిక విలువలను ఏవిధంగా పటిష్టం చేశాయో మననం చేసుకోవడం చాలా అవసరం. ఇక్కడ ప్రత్యేకించి నెహ్రూ ఆర్థిక విధానాల విశిష్టతను చర్చిద్దాం.

1949లో రాష్ట్రాల ముఖ్యమంత్రులకు రాసిన ఒక లేఖలో నెహ్రూ 'మనం రాజకీయంగా స్వతంత్ర దేశంగా ఉండడం మాత్రమే చాలదు. ఆర్థిక స్వాతంత్ర్యం సాధించేవరకూ మన స్వాతంత్ర్య పోరాటం కొనసాగాల్సిందే'నని పేర్కొన్నారు. మనకు స్వాతంత్ర్యం వచ్చేనాటికి పారిశ్రామిక ఉత్పత్తుల కోసం పూర్తిగా విదేశాల దయా దాక్షిణ్యాలపైనే ఆధారపడవలసివచ్చింది. యంత్రాలు, వాటి విడి భాగాలు కావాలంటే దాదాపు 90 శాతం దిగుమతులద్వారా తెచ్చుకోవలసిందే. ఈ పరాధీనత నుండి బయటపడి స్వావలంబన దిశగా దేశాన్ని నడిపించడానికి

నెహ్రూ - మహలోబినస్ రూపొందించిన వ్యూహం పంచవర్ష ప్రణాళికల రూపం తీసుకుంది. 1914 వరకూ సాగిన దేశీయ పరిశ్రమల విధ్వంసం, ఆ తర్వాత 1947 వరకూ నత్తనడకన



సాగిన పారిశ్రామికీకరణ దేశాన్ని బలహీనపరిచాయి. దానినుండి బయటపడి 1951 నుంచి 1969 మధ్య పారిశ్రామిక ఉత్పత్తి మూడు వందల శాతం పెరుగుదలను నమోదు చేసింది. వినిమయ సరుకుల ఉత్పత్తిలో 70 శాతం, పారిశ్రామిక పరికరాల, యంత్రాల ఉత్పత్తిలో 1000 శాతం పెరుగుదల నమోదైంది. దాదాపు 90 శాతం పారిశ్రామిక ఉత్పత్తులను దిగుమతి చేసుకునే దుస్థితి నుండి బయట పడి 1974 నాటికి కేవలం 9 శాతం మాత్రమే దిగుమతి చేసుకునే దశకు బలపడ్డాం. దేశం స్వావలంబన సాధించగలిగిందంటే ఈ విధానాలే కారణం.

స్వాతంత్ర్యం వచ్చేనాటికి దేశంలో ప్రైవేటు రంగం

మిగతా 3లో...

ప్రభుత్వ రంగ సంస్థల స్థాపనకు కృషి

సోషలిస్టు, సెక్యులర్ తొలి భారత ప్రధాని నెహ్రూ

నవంబర్ 14.. భారతదేశ తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి. ఆ రోజునే జాతీయ బాలల దినోత్సవంగా ప్రకటించారు. భారత స్వాతంత్ర్యోద్యమంలో జాతిపిత మహాత్మాగాంధీ తర్వాత అత్యధిక ప్రజాదరణ కలిగిన నెహ్రూ లౌకిక, ప్రజాస్వామిక, శాస్త్రీయ దృక్పథంకై గట్టిగా నిలబడిన నాయకుడు. ఆర్‌ఎస్‌ఎస్, సంఘ్‌పరివార్, మోడీ ఆ దృక్పథాలపైనే దాడి జరుపుతున్న సందర్భంగా వాటిని కాపాడుకోవాలి.



- సిహెచ్.నర్సింగరావు,
సిఐటియు
రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

స్వాతంత్ర్యం నాటికి భారతదేశంలో ఒక్క భారీ పరిశ్రమ కూడా లేదు. మన దేశం నుంచి ముడిసరుకులు విదేశాలకు ఎగుమతి చేసేవారు. విదేశాల నుండి సరుకులను తెచ్చి భారతదేశంలో నాటి బ్రిటీష్ వారు అమ్మేవారు. భారతదేశంలో పరిశ్రమలను అభివృద్ధి కాకుండా బ్రిటీష్ సామ్రాజ్య వాదులు అడ్డుకున్నారు. ఏ దేశమైనా అభివృద్ధి కావాలంటే పారిశ్రామికీకరణ అనివార్యం. అందుకే స్వాతంత్ర్యానంతరం స్వయం సమృద్ధి సాధించడానికి భారత ప్రధాని జవహర్‌లాల్ మిగతా 2లో...

ప్రభుత్వ రంగంతోనే విశాఖ నగరాభివృద్ధి

- ఎ.అజశర్మ,
ప్రధాన కార్యదర్శి,
ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక.

ఉమ్మడి రాష్ట్రంలోనే రెండవ పెద్ద నగరంగా విశాఖ ఉంది. రాష్ట్ర విభజన తరువాత ఆంధ్ర ప్రదేశ్‌లో అతి పెద్ద నగరం ఇదే. స్వాత్రంత్ర్యానికి పూర్వం ఒక చిన్న మత్స్యకార గ్రామంగా ఉన్న విశాఖ నేడు అతి పెద్ద నగరంగానూ, ప్రపంచంలో వేగంగా వృద్ధి చెందుతున్న వంద నగరాలలో ఒకటిగానూ ఉండడానికి ప్రధాన కారణం నగరంలో నెలకొన్న ప్రభుత్వ రంగ పరిశ్రమలే. ఇంకా విశాలంగా చెప్పాలంటే.. ప్రభుత్వ రంగ సంస్థలు దేశాభివృద్ధిలోనూ, దేశ స్వావలంబన సాధించడంలోనూ ప్రముఖ పాత్ర నిర్వహించాయి. అందుకే దేశ మొదటి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వ రంగ పరిశ్రమలను ఆధునిక దేవాలయాలని అభివర్ణించారు. కానీ నేటి పాలకులు అటువంటి సంస్థలను ధ్వంసం చేయడమే ఒక విధానంగా పెట్టుకున్నారు.

1901 సంవత్సరంలో 40,892 ఉన్న నగర జనాభా విశాఖ పోర్టు ట్రస్టు ఏర్పడిన తరువాత 1951 కల్లా రెట్టింపుకుపైగా పెరిగింది. హిందూస్థాన్ షిప్‌యార్డ్ స్థాపనతో ఈ పెరుగుదల క్రమం మరింత పుంజుకుంది. 1951-61 మధ్య పదేళ్ళ కాలంలోనే నగర జనాభా రెట్టింపు పెరిగి 2లక్షల 15వేలకు చేరుకుంది. బిహెచ్‌పివి ఏర్పడిన తరువాత 1971 నాటికి 3,68,000కు జనాభా చేరింది. నేవల్ డాక్‌యార్డ్ విస్తరణ, విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ఏర్పడిన తరువాత 1991 కల్లా జనాభా 13లక్షల 57వేలకు పెరిగింది. ఇదంతా ప్రభుత్వ సంస్థల వల్లనే జరిగింది. ప్రభుత్వ సంస్థలలో మెరుగైన ఉపాధికై అనేక మంది గ్రామీణ ప్రాంతాల నుండి నగరానికి వలసలు వచ్చారు. వీటితో పాటు హెచ్‌పిసిఎల్, బ్యాంకులు, ఇతర ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల వల్ల 2011లో 17.43 లక్షలు, 2021లో 22.26 లక్షల జనాభా ఉంది. నేడు విశాఖ నగర జనాభా సుమారు మిగతా 2లో...

సోషలిస్టు, సెక్యులర్ తొలి భారత ప్రధాని నెహ్రూ

(మొదటి పేజీ తరువాయి..) నెహ్రూ నడుం బిగించారు. స్వాతంత్య్రానికి ముందు గుండు సూదితో సహ విదేశాల నుండి దిగుమతి చేసుకోవాల్సి వచ్చేది. ప్రాణావసరమైన కనీస పెన్సిలిన్ మందు కూడా మన దేశంలో లభ్యం కాలేదు. సోషలిస్టు దేశాలు ముఖ్యంగా రష్యా సహాయంతో మన దేశంలో పారిశ్రామికీకరణ అభివృద్ధి జరిగింది. మందుల పరిశ్రమలకు సంబంధించిన డిజైన్ ఇవ్వాలని అమెరికా నాటి అధ్యక్షుడు కెనడీని నెహ్రూ అనేక సార్లు బ్రతిమాలారు. కానీ కెనడీ అంగీకరించలేదు. రష్యా సహాయంతో ఇండియన్ డ్రగ్స్ అండ్ ఫార్మస్యుటికల్ కంపెనీ లిమిటెడ్ (ఐడిపిఎల్) ఏర్పడింది. బిలాయ్, బొకారోలలో స్టీల్ ప్లాంట్లును రష్యా నిర్మించింది. విశాఖ స్టీల్‌ప్లాంట్‌లోని బ్లాస్ట్ ఫర్నేస్‌ను కూడా రష్యాయే కట్టింది. దాదాపు వంద పరిశ్రమలకుపైగా ప్రభుత్వ రంగంలో నిర్మించడానికి అన్ని సోషలిస్టు దేశాలు భారతదేశానికి తోడ్పడ్డాయి. అందువల్లనే 1970వ దశకం నాటికి భారతదేశం అన్ని రంగాల్లో స్వయం సమృద్ధి సాధించింది. 'ఇస్రో' సంస్థ ద్వారా అంతరిక్షంలోకి ఒకేసారి 103 రాకెట్స్ పంపగలుగుతున్నాం. స్వాతంత్య్రానికి ముందు ప్రారంభించిన విశాఖ షిప్ యార్డు వాల్‌చంద్, హీరాచంద్‌కు చెందిన కంపెనీ. కానీ వీరు షిప్‌లు నిర్మించలేక ప్రభుత్వాన్ని స్వాధీనం చేసుకోమని నెహ్రూకు లేఖ రాశారు. నెహ్రూ విశాఖ వచ్చి స్వయంగా హిందూస్థాన్ షిప్‌యార్డును కేంద్ర ప్రభుత్వ రంగంలోకి స్వాధీనం చేసుకున్నారు.

విశాఖలో జల ఉష ప్రారంభ వేడుకలో నెహ్రూ (ఫైల్ ఫొటో)

దేశంలోని అగ్రగామి షిప్‌యార్డుగా నేడు అభివృద్ధి చెందింది.

కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు 250పైగా నేటికీ రాణిస్తున్నాయి. అన్ని రంగాల్లోనూ అభివృద్ధి సాధించాయి. నష్టాల్లోని ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలన్నీ జాతీయం చేయబడ్డాయి. ప్రభుత్వ రంగంలోని ఎల్‌ఐసి సంస్థను కేవలం రూ.5 కోట్లతో స్థాపించగా ఈనాడు దాని విలువ రూ.62 లక్షల కోట్లకు పెరిగింది. ప్రభుత్వ రంగం ద్వారా దేశ సంపద అభివృద్ధి చెందింది. విదేశాల నుండి సరుకులు కొనకుండా విదేశీ మారకద్రవ్యం మిగిలింది. ప్రభుత్వ ఆదాయంలో లక్షల కోట్లు ప్రతి సంవత్సరం పన్నులు, డివిడెండ్ల రూపంలో కేంద్ర బడ్జెట్‌కు సమకూరుతున్నాయి. భారీ పరిశ్రమలు దేశమంతటా విస్తరించడం వల్ల వెనకబడ్డ ప్రాంతాలు అభివృద్ధి చెందాయి. ఒక భారీ పరిశ్రమకు అనుబంధంగా అనేక వందల చిన్న పరిశ్రమలు వచ్చాయి. ఈ పరిశ్రమలన్నింటిలో ఉపాధి లక్షల సంఖ్యలో పెరిగింది. ప్రైవేట్ పరిశ్రమల కంటే ప్రభుత్వ రంగ పరిశ్రమల్లో జీతాలు, సౌకర్యాలు మెండు. లాభాల కోసమే పరిశ్రమలు పెట్టే ప్రైవేట్ యాజమాన్యాల కంటే ప్రభుత్వ రంగం అనేక రెట్లు మిన్న. నెహ్రూ స్థాపించిన ప్రభుత్వం రంగ అనుకూల విధానాలకు నేడు బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ ప్రభుత్వాలు తీవ్రంగా తూట్లు పొడుస్తున్నాయి. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ విధానాలు సమాజానికి హానికరం. కేంద్ర ప్రభుత్వ రంగాలను కాపాడుకోవాల్సిన బాధ్యత నేడు ప్రజలు, కార్మికవర్గంపై ఉంది.

ప్రజా సేవలో రైల్వే

విశాఖ రైల్వే స్టేషన్

టి.చిట్టిబాబు,
పూర్వ అధ్యక్షులు,
హెడ్ క్వార్టర్స్ 1 బ్రాంచ్,
ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక యూనియన్, విశాఖపట్నం.

ప్రజల సౌకర్యార్థం ప్రజా రవాణాను సరసమైన ఛార్జీలతో నడపడం ప్రభుత్వ బాధ్యత. దీనిలో కీలకమైనది రైల్వే. అందుకే నాటి ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ మంత్రివర్గం తీసుకున్న విధానపరమైన నిర్ణయాల్లో వ్యూహాత్మక రంగాలలో కీలకమైన వాటిలో రైల్వే అతిముఖ్యమైనది. దీన్ని ప్రభుత్వమే నడుపుతూ వస్తోంది.

బ్రిటీష్ పాలనలో వారి ఆర్థిక ప్రయోజనాలు, సైనిక అవసరాలు కోసం 1845లో రైల్వే ప్రారంభమైంది. 1853 ఏప్రిల్ 16న 34 కిలోమీటర్ల ట్రాక్‌పై ఒక్క ప్యాసింజర్ రైలుతో ప్రారంభమైన రైల్వే క్రమంగా అభివృద్ధి చెందుతూ నేడు సొంతంగా లోకోలు, కోచ్‌లు, ఇతర సామగ్రి తయారీలకు 6 ప్రొడక్షన్ యూనిట్లుకు చేరింది. 1,32,310 కిలోమీటర్ల ట్రాక్, 7335 స్టేషన్లు, 14781 లోకోలు, 84,863 ప్రయాణికుల కోచ్‌లు, 3,18,196 వ్యాగన్లు, రోజూ 13,523 ప్రయాణికుల రైళ్లు, 9146 గూడ్స్ రైళ్లు, రోజూ రెండు కోట్ల మంది ప్యాసింజర్లను రవాణా చేస్తూ ప్రపంచంలో నాలుగో అతి పెద్ద రైల్వే వ్యవస్థగా నిలిచింది. ఎక్కువ మంది ఉద్యోగులగల సంస్థలో ఎనిమిదో స్థానంలో వుంది.

అయితే, బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న సరళీకరణ ఆర్థిక విధానాల కారణంగా రైల్వేలో అనేక డిపార్టుమెంటుల్లో చాపకింద నీరులా అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టీకరణ, ప్రైవేటీకరణ జోరుగా సాగుతున్నాయి. తమకిచ్చిన లక్ష్యాలను దాటి రికార్డు స్థాయిలో మార్కెట్ ధరల కంటే తక్కువకే ఎల్‌హెచ్‌బి కోచ్‌లను, వందే భారత్ రైళ్లను ఉత్పత్తి చేస్తున్న పెరంబూర్ రైలు కోచ్ ఫ్యాక్టరీ, కపుర్తలా కోచ్ ఫ్యాక్టరీ, ఎలక్ట్రికల్ లోకో ఇంజిన్లు తయారు చేస్తున్న సిఎల్‌డబ్ల్యు మొదలైన వాటి ఉత్పత్తి తగ్గించి విదేశీ సంస్థల నుండి కొనుక్కోవడం, అవుట్ సోర్సింగ్‌ను ముందుకు తెచ్చి శాశ్వత సిబ్బందిని కుదించడం జరుగుతోంది. 150 ప్యాసింజర్ రైళ్లను, 400 స్టేషన్లను ప్రైవేట్ సంస్థలకు ఇవ్వాలని మోడీ సర్కారు నిర్ణయించి మరోవైపు స్టేషన్ల ఆధునికీకరణకు విపరీతంగా ఖర్చు చేస్తున్నారంటే ఎవరికోసమో అర్థం చేసుకోవొచ్చు. ఇదిలా ఉండగా రైల్వేలో గత జులై నాటికే 3,62,200 పోస్టులు ఖాళీగా ఉన్నాయని పార్లమెంట్‌లో ప్రశ్నకు సమాధానంగా ప్రభుత్వమే తెలిపింది. అంటే ఉన్న ఉద్యోగులపై పని భారం తీవ్రత ఏ స్థాయిలో ఉందో ఇట్టే అర్థం చేసుకోవొచ్చు.

1893 సంవత్సరంలో మూడు గూడ్స్ ట్రైన్స్, 200 మంది సిబ్బందితో ప్రారంభమైన ప్రారంభమైన వాల్తేరు డివిజన్ విశాఖ పోర్టు, హెచ్‌పిసిఎల్, బిహెచ్ఇఎల్, హెచ్‌ఎస్‌ఎల్, ఎన్‌టిపిసి, గంగవరం పోర్టు, విశాఖ పోర్టు వంటి సంస్థలకు అన్ని విధాలా తోడ్పడుతూ వచ్చింది. దీంతో 1985 నాటికే 21200 మందికి ఉద్యోగులు పెరిగారు. సరళీకరణ, ప్రైవేటీకరణ విధానాలు అమలు తరువాత సిబ్బందిని 16,200కు తగ్గించేశారు. స్టీల్‌ప్లాంట్‌లో ఉత్పత్తి తగ్గడంతో గూడ్స్ రైళ్ల రాకపోకలు తగ్గాయి.

ఇంకా తగ్గితే రైల్వే స్టీల్ యార్డులో వున్న రైల్వే సిబ్బందిని తగ్గిస్తారు. ప్రభుత్వ రంగ సంస్థల మనుగడతో ఈ డివిజన్ పురోగతి ఆధారపడి ఉందన్నది దీన్ని బట్టే అర్థమవుతోంది. ప్రస్తుతం రాష్ట్ర విభజన హామీల అమలులో భాగంగా విశాఖలో వాల్తేరు డివిజన్‌తో కూడిన రైల్వే జోన్ ఏర్పాటు చేయాలని రైల్వే యూనియన్లు, ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే ప్రభుత్వ రంగ పరిరక్షణను కాంక్షిస్తున్నారు. ఆ దిశగా పోరాటాలకు సమాయత్తమవుతున్నారు.

ప్రభుత్వ రంగంతోనే విశాఖ నగరాభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి..) 25 లక్షలుగా ఉంది.

ఈ ప్రభుత్వ సంస్థల నిర్మాణం వల్ల వాటిలో పనిచేసే ఉద్యోగుల గృహవసతి, గృహోపకర వస్తువులు వంటి అవసరాలు తీర్చడానికి సర్వీసు రంగం అభివృద్ధి అయింది. ఈ జనాభా ఆహార అవసరాలకై సమీప గ్రామాలలో కూరగాయల పంటలు పెరిగాయి. ఇలా పారిశ్రామికీకరణ వలన వ్యవసాయ, సర్వీసు రంగాలు కూడా అభివృద్ధి జరిగి, అనేక మందికి ఉపాధి అవకాశాలు కల్పించబడ్డాయి.

కేవలం జనాభా పెరగడమే కాక, ఇతర అవసరాలకై నగర వైశాల్యం కూడా క్రమంగా పెరుగుతూ వస్తోంది. నేడు 681 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో దేశంలోనే మూడవ పెద్ద నగరంగా నిలిచింది. ఈ పారిశ్రామికీకరణ వలన 3,67,529 కోట్ల రూపాయల స్థూల జాతీయ ఉత్పత్తితో దేశంలో తొమ్మిదవ సంపన్న నగరంగా ఉంది. వార్షిక బడ్జెట్ 4,171 కోట్ల రూపాయలుగా ఉంది.

అయితే 1991 నుండి దేశంలో అమలవుతున్న నయా ఉదారవాద ఆర్థిక విధానాల వల్ల ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ప్రారంభమైంది. వీటి ప్రభావం విశాఖ నగరంపై కూడా సహజంగానే బలంగా పడింది. మహరత్న కంపెనీగా ఉన్న హిందూస్థాన్ జింక్ పరిశ్రమను పూర్తిగా అమ్మేయడం, తరువాత మూతబడడం జరిగింది. విశాఖపట్నం పోర్టు, షిప్‌యార్డ్, బిహెచ్‌పివి, డాక్‌యార్డ్ వంటి సంస్థలలో శాశ్వత ఉద్యోగుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. ఉదాహరణకు విశాఖపట్నం పోర్టులో 1991 నాటికి 13,019 వుండి శాశ్వత కార్మికులుండగా 2021 నాటికి కేవలం 2,700 మంది మాత్రమే ఉన్నారు. షిప్ యార్డులో 6,795 నుండి ఇదే కాలంలో కార్మికుల సంఖ్య 530 మందికి పడిపోయింది. బిహెచ్‌పివి 4వేలు నుండి 550కు తగ్గిపోయింది.

విశాఖ నగరానికే కాక, రాష్ట్రానికే తలమానికంగా ఉన్న విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌ను అమ్మేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. అత్యధిక మందికి ఉపాధి కల్పిస్తున్న ఈ భారీ పరిశ్రమ ప్రభుత్వ రంగం నుండి వైదొలగడమంటే అది విశాఖ అభివృద్ధికి అశనిపాతమే. దీనిని పరిరక్షించుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని పారిశ్రామిక విధానాలు ప్రకటించినా ఫలితం శూన్యమే. ఆధునిక టెక్నాలజీ, ఒడరేవు కలిగి దేశంలోనే విశిష్ట స్థానంలో నిలిచిన విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడే బాధ్యత రాష్ట్ర ప్రయోజనాల రీత్యా రాష్ట్ర ప్రభుత్వంపైనా ఉంది.

నగరాభివృద్ధిలో విశేషమైన పాత్ర పోషించిన ఇటువంటి ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవడం ద్వారానే అభివృద్ధిని సుస్థిరం చేసుకోవడం, మరింత అభివృద్ధి సాధించడం సాధ్యం. సాధారణ ప్రజానీకం, అభివృద్ధి కాముకులు ఈ దిశలో కృషి చేసి, ప్రభుత్వం ప్రైవేటీకరణ విధానాలను ఉపసంహరించుకునేలా ఒత్తిడి తేవడమే నేటి కర్తవ్యం.

ఎన్నికల ముందు స్టీల్ ప్లాంట్‌ను కాపాడతామని హామీ ఇచ్చిన తెలుగుదేశం, జనసేన పార్టీలు ఆ హామీకి కట్టుబడి ఉండేలా రాష్ట్ర ప్రజలు చైతన్యం చూపాలి.

తెలుగు ప్రజల హక్కు.. విశాఖ ఉక్కు

యు.రామస్వామి,
ప్రధాన కార్యదర్శి,
స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్
యూనియన్ (సిఐటియు)

విశాఖ స్టీల్‌ప్లాంట్ వెనుక తెలుగు ప్రజల చారిత్రక పోరాట నేపథ్యం వుంది. 'విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు' నినాదంతో 32 మంది ప్రాణాల బలిదానంతో తెలుగు ప్రజలు ఏకోన్ముఖంగా పోరాడి సాధించుకున్న ఘనత దీనిది. ఉక్కు పరిశ్రమ పురోగమనంలో కార్మికులు, ఉద్యోగుల కఠోర శ్రమ వుంది. ప్రభుత్వాల సహాయ నిరాకరణ, కుట్రలపై ప్రతిఘటన వుంది. ఆది నుంచి ప్రభుత్వాల కుట్రలు, కుతంత్రాలను ఎదురొడ్డి ఉక్కు పరిశ్రమను నిలబెట్టుకోవడంలో ప్రజల పాత్ర వుంది. సోషలిస్టు రష్యా సహకారం వుంది.

అది 1963వ సంవత్సరం. ఐదో స్టీల్‌ప్లాంట్ నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అప్పటికే భిలాయ్, బొకారో, రూర్కెలా, దుర్గాపూర్‌లో స్టీల్‌ప్లాంట్‌లు ఉండడంతో, సముద్ర తీరానవున్న విశాఖపట్నం అనుకూల స్థలమని ఆంగ్లో ఇండియన్ కన్సార్టియం ప్రతిపాదించింది. విశాఖలో స్టీల్‌ప్లాంట్ నిర్మించాలని 1966 జులై 1న శాసనసభ ఏకగ్రీవంగా తీర్మానించి, కేంద్ర ప్రభుత్వానికి పంపింది. దీనికి ఆనాటి కేంద్ర కాంగ్రెస్ ప్రభుత్వం సానుకూలంగా లేదు. అయితే, వెనుకబడిన విశాఖపట్నంలో స్టీల్‌ప్లాంట్ నిర్మిస్తే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని, ఉపాధి దొరుకుతుందని నాడు అందరిలో ఆశ చిగురించింది. విశాఖలో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు చేయాలని 1966 అక్టోబర్ 21న విద్యార్థులు ప్రదర్శన చేపట్టారు. 'విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు' అని నినదించారు. రైళ్లను ఆపేశారు. ఉద్యమ నినాదం తెలుగు ప్రజల్లోకి బలంగా వెళ్లింది. సాధించుకోవాలన్న పట్టుదల పెరిగింది. ఇది భరించలేని ప్రభుత్వం 1966 నవంబరు 1న ఉద్యమకారులపై కాల్పులు జరిపి 9 మందిని బలితీసుకుంది. దీన్ని నిరసిస్తూ వీధుల్లోకి వచ్చి ఆందోళనకు దిగిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు, యువకులు, ప్రజలపై ప్రభుత్వం దమనకాండకు దిగి 32 మంది ప్రాణాలను బలిగొంది.

కాల్పులను నిరసిస్తూ, విశాఖపట్నంలో స్టీల్‌ప్లాంట్ నిర్మించాలని డిమాండ్‌తో కమ్యూనిస్టు ఎమ్మెల్యేలు పుచ్చలపల్లి సుందరయ్య, తరిమెల నాగిరెడ్డి సహా 53 మంది కమ్యూనిస్టు ఎమ్మెల్యేలు, తెన్నేటి విశ్వనాధం వంటి 14 మంది ప్రతిపక్ష ఎమ్మెల్యేలు, ఏడుగురు ఎంపీలు రాజీనామా చేసి ఉద్యమంలో పాల్గొన్నారు. అమృతరావు నిరాహారదీక్ష ప్రారంభించారు. ప్రజాపోరాటాల ధాటికి తట్టుకోలేక నాటి కేంద్ర ప్రభుత్వం దిగొచ్చింది. 1970 ఏప్రిల్ 17న నాటి ప్రధాని ఇందిరా గాంధీ విశాఖలో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటును ప్రకటించి, 1971 జనవరి 20న పైలాన్ ఏర్పాటుచేశారు. విశాఖ ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి 16,500 మంది రైతులు ముందుకొచ్చి, 64 గ్రామాలు ఖాళీచేసి 22 వేల ఎకరాల భూములిచ్చారు.

కేంద్రం సహాయ నిరాకరణ : అప్పులతో వడ్డీల భారం

స్టీల్ అథారిటీ ఇండియా లిమిటెడ్ (సెయిల్) నుంచి విశాఖ స్టీల్ ప్లాంట్‌ను 1982 ఫిబ్రవరి 18న వేరుచేసింది. 20 మిలియన్ టన్నుల సామర్థ్యంతో నిర్మించాల్సిన స్టీల్‌ప్లాంట్‌ను రేషనలైజ్డ్ కాన్సెప్ట్ పేరుతో 3.4 మిలియన్ టన్నులకు పరిమితం చేసి కేంద్రం కేవలం రూ.4,889 కోట్లు కేటాయించింది. మిగిలిన డబ్బులు వివిధ బ్యాంకుల్లో అప్పులు చేసి 3.4 మిలియన్ టన్నుల సామర్థ్యంతో స్టీల్‌ప్లాంట్‌ను నిర్మించుకొని 1991లో ఉత్పత్తి ప్రారంభించారు.

దేశంలో ఇతర స్టీల్‌ప్లాంట్లను కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మించగా, విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కేంద్ర సహకారం లేకపోవడంతో, అప్పులుచేసి నిర్మించడంతో వడ్డీల భారం పెరిగింది. వడ్డీలు పెరిగి నష్టాలు రావడంతో 1999లో బిజెపి ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను బిఐఎఫ్‌ఆర్‌కు నివేదించి, ప్రయివేటీకరణ వాదన ముందుకు తెచ్చింది. దీనికి వ్యతిరేకంగా పోరాటం జరగడంతో రూ.1500 కోట్లు కేటాయించింది. స్టీల్‌ప్లాంట్‌కు ప్రభుత్వాలు సొంత గనులు కేటాయించకపోయినా, బహిరంగ మార్కెట్‌లో గనులు కొనుక్కొని, 120 శాతం సామర్థ్యంతో నడిచేలా కార్మికులు, ఉద్యోగులు విశేష కృషిచేశారు. 2002 నుంచి (మిగతా 8లో..)

విశాఖ పోర్టు

నగరాభివృద్ధిలో విశాఖ పోర్టు పాత్ర

బి.జగన్, కార్యదర్శి,
యునైటెడ్ పోర్టు అండ్
డాక్ ఎంప్లాయీస్
యూనియన్,

విశాఖనగర అభివద్ధిలో విశాఖపోర్టు కీలకం. అతి తక్కువ రేటుతో సరుకుల రవాణా చేస్తోంది. అందుకే పోర్టు ఆధారంగా ముడిసరుకులు తెచ్చేకునే ఇతర ప్రభుత్వరంగ, ప్రైవేటు పరిశ్రమలు ఇంతలో ఏర్పడ్డాయి. దీంతో ఒక మత్స్యకార పల్లె మహానగరంగా అభివృద్ధి కావడానికి విశాఖపట్నం పోర్టు బీజం వేసింది.

విశాఖ పోర్టు బ్రిటీష్ కాలంలోనే 1933 సంవత్సరంలో పూర్తిస్థాయిలో ప్రారంభమైన పోర్టు స్వాతంత్ర్యం అనంతరం వివిధ పంచవర్ష ప్రణాళికల ద్వారా ప్రభుత్వరంగంలో మేజర్‌పోర్టుగా అభివృద్ధి చెందింది. 2000 దశకంలో వరుసగా 7సంవత్సరాలు నెంబర్ వన్ పోర్టుగాను, తరువాత మూడేళ్లు రెండవ స్థానంలో నిలిచింది. అనేక రికార్డులను నెలకొల్పడమేగాక లాభాల బాటలో పయనిస్తోంది. 2018లో రూ.259 కోట్లు, 2019లో రూ.200 కోట్లు, 2020లో రూ.274 కోట్లు, 2021లో రూ.238 కోట్లు, 2022లో రూ.275 కోట్లు, 2023లో రూ.380 కోట్లు, 2023-24లో సుమారు రూ.700 కోట్లు లాభాలతో విశాఖ పోర్టు నడుస్తోంది. రిజర్వ్ ఫండ్స్ రూ.3,582 కోట్లు ఉన్నాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పిస్తోంది. ప్రభుత్వరంగంలో ఉండటం వల్ల దళిత, గిరిజన తరగతులకు రిజర్వేషన్లు ద్వారా ఉపాధి అవకాశాలు దక్కాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వివిధ రూపాల్లో ఆదాయాలు సమకూర్చుతోంది. 2023లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు (మిగతా 4లో..)

దేశానికి వెన్నెముక ప్రభుత్వ రంగం

(మొదటి పేజీ తరువాయి..)

బలంగా లేదు. దేశ పారిశ్రామిక అవసరాలను తీర్చగలిగే సామర్థ్యం దానికి లేదు. సాంకేతిక సహాయంగానీ, పెట్టుబడులు పెట్టే రూపంలోగానీ మన స్వావలంబనకు తోడ్పడడానికి అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ తదితర పెట్టుబడిదారీ దేశాలు సుముఖంగా లేవు. ఆ తరుణంలో మనకు నిస్వార్థంగా సహాయం అందించి మన కాళ్ళమీద మనం నిలబడేలా చేయడానికి తోడ్పడింది సోవియట్ యూనియన్ నాయకత్వంలోని సోషలిస్టు శిబిరం. ఆ సహాయాన్ని అందుకుని నెహ్రూ దేశంలో ప్రభుత్వ రంగ స్థాపనకు, భారీ ప్రాజెక్టుల నిర్మాణానికి బాటలు వేశారు.

రౌర్కెలా, భిలాయ్, దుర్గాపూర్, బొకారో ఉక్కు కర్మాగారాలు ప్రభుత్వ రంగంలో ఏర్పడింది నెహ్రూ కాలంలోనే. ఇండియన్ టెలిఫోన్ ఇండస్ట్రీస్, భాక్రా డామ్, దామోదర్ వ్యాలీ కార్పొరేషన్, హిరాకుండ్ డామ్ 1947-48 నాటికే మొదలయ్యాయి. హిందూస్తాన్ మెషిన్ టూల్స్, భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్, హిందూస్తాన్ షిప్‌యార్డ్, భారత్ పెట్రోలియం, హెవీ ఇంజినీరింగ్ కార్పొరేషన్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, హిందూస్తాన్ యాంటీ బయోటిక్స్, హిందూస్తాన్ ఇన్‌సెక్టిసైడ్స్, నాగార్జున సాగర్ ప్రాజెక్టు, నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వంటివి 1950 దశకంలో ప్రారంభమయ్యాయి. నేషనల్ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్, ఇండియన్ డ్రగ్స్ అండ్ ఫార్మస్యూటికల్స్, ఫెర్టిలైజర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, హిందూస్తాన్ ఎయిరోనాటిక్స్ లిమిటెడ్, భారత్ ఎర్త్ మూవర్స్ వంటి పరిశ్రమలు 1960 దశకంలో మొదలయ్యాయి.

ఈ పరిశ్రమలేవీ ప్రస్తుత ప్రభుత్వాలు ఆరోపిస్తున్నట్టు దేశ ఆర్థిక వ్యవస్థకు గుదిబండలుగా ఆ కాలంలో నడవలేదు. మన దేశ అవసరాలను తీర్చగలగడమే కాకుండా అవి ఆర్థిక వనరులను సమీకరించే సాధనాలుగా కూడా పని చేశాయి. 1965 వరకూ ప్రైవేటు రంగం కన్నా అధికంగా పెట్టుబడులను సమీకరించగలిగాయి. 1950 దశకంలో ప్రారంభించిన హెచ్‌ఎంటి పరిశ్రమ సాధించిన లాభాలతోటే రెండో హెచ్‌ఎంటి యూనిట్‌ను 1961లో

నెలకొల్పగలిగామని నెహ్రూ సగర్వంగా ప్రకటించారు. ఆ కాలంలో బ్రిటన్, అమెరికా, ఫ్రాన్స్, జపాన్, చైనా వంటి దేశాల వృద్ధిరేటు కన్నా ఎక్కువ వృద్ధిరేటు భారతదేశం నమోదు చేయగలిగింది. ప్రైవేటు పెట్టుబడులు, విదేశీ పెట్టుబడులు లేనిదే ఆర్థికవృద్ధి సాధ్యం కాదంటూ నేడు మోడీ నుండి చంద్రబాబు వరకూ చేస్తున్న ప్రచారం ఎంత అవాస్తవమో ఈ అనుభవాలే చెప్తున్నాయి. ప్రైవేటు రంగంలో ఉన్న ఇన్సూరెన్స్, బ్యాంకింగ్ రంగాలను జాతీయం చేసిన తర్వాత పెట్టుబడుల సమీకరణ శక్తి ఎన్నో రెట్లు పెరిగింది. వీటిద్వారా ప్రజలే దేశానికి కావలసిన పెట్టుబడులను అందించారు.

1990 దశకంలోని పివి నరసింహారావు ప్రభుత్వం కాలంలో నెహ్రూ విధానాలను తిరగదోడి నయా ఉదారవాద విధానాలకు, ప్రైవేటీకరణకు తెర తీశారు. ఆనాటి ఆర్థిక మంత్రి మన్మోహన్ సింగ్ తర్వాత కాలంలో ప్రధానమంత్రి అయ్యారు. ఆయన నేతృత్వంలోని యుపిఎ -1 ప్రభుత్వ కాలంలో 2008లో ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థను సమూలంగా కుదిపివేసిన ఆర్థిక సంక్షోభం గురించి మనకు తెలుసు. ఆ సంక్షోభం తాకిడిని భారతదేశం తట్టుకోగలిగిందంటే అందుకు కారణం ప్రభుత్వ రంగమే. "మన ఆర్థిక వ్యవస్థలోని మూలాలు బలంగా ఉండడం వల్లనే సంక్షోభాన్ని తట్టుకున్నాం" అని మన్మోహన్ సింగ్ ఆ రోజుల్లో ప్రకటించారు. ఏమిటా మూలాలు ? మన ప్రభుత్వ రంగమే. ప్రధాన పరిశ్రమలు, ఆర్థిక రంగం ప్రభుత్వ రంగంలోనే కొనసాగడం వల్లనే ప్రపంచ సంక్షోభ తాకిడిని తట్టుకున్నాం. కానీ మోడీ ప్రభుత్వం ఆ పటుత్వాన్ని దెబ్బ తీసే పనిలో దూకుడుగా పోతోంది. ఇది దేశద్రోహం తప్ప మరొకటి కాదు.

మన వ్యవసాయ రంగం స్వతంత్రం వచ్చేనాటికి చాలా ఘోరమైన పరిస్థితిలో ఉండేది. ఒక కోటి నలభై లక్షల టన్నుల ఆహారధాన్యాలను 1946-1953 మధ్య దిగుమతి చేసుకోవలసివచ్చింది. ఈ దుస్థితి నుండి బయటపడడమే గాక నేడు మనం భారీగా ఆహారధాన్యాల నిల్వలను నిర్వహించుకోగలుగుతున్నాం. దీనికి కారణం నెహ్రూ కాలపు విధానాలు. సహకార వ్యవస్థను పటిష్టం చేయడం, (మిగతా 5లో..)

ప్రజల పొదుపునకు భద్రత ఎల్ఐసి

విశాఖలోని ఎల్ఐసి కార్యాలయం

1956లో కేవలం రూ.5 కోట్ల మూలధనంతో ప్రారంభమైన ప్రభుత్వ రంగసంస్థ ఎల్ఐసి ఆస్తులు, నేడు రూ.46లక్షల కోట్లకు చేరుకున్నాయి. 2022-23 మొదటి క్వార్టర్‌తో పోల్చితే, 2023-24 మొదటి క్వార్టర్‌లో 1300శాతం లాభం (రూ.9544 కోట్లు) ఎల్ఐసి ఆర్జించడం విశేషం. దేశీయ బీమారంగంలో ప్రయివేటు కంపెనీల ప్రవేశం జరిగి 23ఏళ్లయినా, నేటికీ ప్రీమియమ్ ఆదాయంలో 63 శాతం, పాలసీలలో 72శాతం మార్కెట్ వాటాతో ఇప్పటికీ మార్కెట్ లీడర్‌గా ముందుకు సాగుతోంది. దేశంలో లైఫ్ ఇన్సూరెన్స్ రంగంలో ఎల్ఐసి తర్వాత 2వ స్థానంలో ప్రయివేటు బీమా కంపెనీ ఎస్‌బీఐ లైఫ్ కంపెనీ ఉంది. ఎల్ఐసి మార్కెట్ వాటా 63 శాతంతో పోలిస్తే ఎస్‌బిఐ లైఫ్ మార్కెట్ వాటా 8శాతం మాత్రమే ఉంది. క్లెయిమ్ సెటిల్‌మెంట్‌లో ఎల్ఐసి ప్రపంచ రికార్డును కలిగి ఉంది. సర్వీసు విషయంలోనూ, క్లెయిమ్ సెటిల్‌మెంట్, నిర్వహణ సామర్థ్యాలు, ఉత్పాదకత పరంగా ప్రపంచంలోని మరే ఇతర కంపెనీ కూడా ఎల్ఐసికి సాటి లేదు. ప్రపంచంలో 99శాతం పైబడి క్లైములను పరిష్కరిస్తూ, నేటికీ ప్రపంచంలో నెంబర్ వన్ స్థానంలో ఎల్ఐసి ఉంది. రక్షణ రంగం, రైల్వేల తర్వాత ఎక్కువ ఆస్తులు కలిగి ఉన్న ఆర్థిక సంస్థగా ఎల్ఐసీ ఉంది. ఫార్చ్యూన్ గ్లోబల్ సూచీ-2023లో 107వ ర్యాంక్ పొందడమే గాక, మొత్తం ప్రీమియం ఆదాయంలో ప్రపంచంలో పదవ అతి పెద్ద సంస్థగా ఎల్ఐసి నిలిచింది.

జి.వరప్రసాద్,
ప్రధాన కార్యదర్శి,
ఐసిఇయు, విశాఖపట్నం డివిజన్

'ప్రజలు దాచుకున్న పొదుపు ప్రజల శ్రేయస్సు, దేశ ఆర్థిక స్వావలంబన కోసమే' నినాదంతో 1956 నుంచి, ఇప్పటివరకు దేశ ఆర్థిక వ్యవస్థలో దాదాపు రూ.40లక్షల కోట్ల పైబడి పెట్టుబడులుగా పెట్టింది. 31 మార్చి 2022 నాటికి ఎల్ఐసి రూ.40,84,826 కోట్ల పెట్టుబడులను మన దేశ ఆర్థిక వ్యవస్థలో పెట్టుబడులు పెట్టింది. ఇందులో రూ.28,85,569 కోట్ల నిధులను కేంద్ర, రాష్ట్ర సెక్యూరిటీలలో, హౌసింగ్, నీటిపారుదల సౌకర్యాల కల్పన కోసం ఎల్ఐసి కేటాయించింది. సుమారు ఒక లక్ష ఉద్యోగులను మాత్రమే కలిగిన ఎల్ఐసి సంస్థ దాదాపు 30కోట్ల వ్యక్తిగత పాలసీలకు సేవలు అందిస్తోంది. ఎల్ఐసి సంస్థ కోసం పని చేసే 13.43లక్షల ఏజెంట్‌లలో 48శాతం పైబడి గ్రామీణ ప్రాంతాల్లోని ఉన్నారు. నేడు దేశీయ బీమా రంగంలో ఉన్న 26 ప్రయివేటు బీమా కంపెనీలు అన్నీ కలిపి దేశంలో ఉన్న 79శాతం జిల్లాల్లో ఆఫీసు లు కలిగి ఉంటే,ఒక్క ఎల్ఐసి సంస్థనే దేశవ్యాప్తంగా ఉన్న 92 శాతం జిల్లాల్లో కార్యాలయాలు కలిగి ఉంది.అలాంటి జీవిత బీమారంగం ఎల్ఐసిని దొంగదెబ్బ తీసేందుకు కేంద్రం కుట్ర చేస్తోంది.

ప్రభుత్వ బీమారంగ ప్రయోజనాలకు ప్రతికూలంగా కొన్ని విధాన నిర్ణయాలకు బీమా నియంత్రణ సంస్థ (ఐఆర్‌డిఏఐ) యత్నిస్తోంది. ఇటీవల జరిగిన పార్లమెంట్ సమావేశాల్లో బీమా చట్ట సవరణ బిల్లును ప్రవేశపెట్టనుందని ప్రచారం జరిగినా, ప్రభుత్వం వెనక్కు తగ్గింది. బీమా చట్ట సవరణల ద్వారా, కనీస మూలధన అవసరాన్ని మార్చాలని, కమిషన్ చెల్లింపులో మార్పులను, మిశ్రమ లైసెన్సుల జారీని అనుమతించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ ఈ సవరణలు అమలైతే, ప్రజల పొదుపుకు హాని కలిగించే మోసపూరిత అవకాశాలు ఉన్న1956కి ముందు ఉన్న కాలానికి బీమా రంగం వెళ్లినట్లవుతుంది.

స్టాక్ మార్కెట్‌లో నమోదైన మార్కెట్ క్యాపిటలైజషన్ కన్నా, ఎల్ఐసి నిజవిలువ కొన్ని రెట్లు ఉంటుందనే వాస్తవాన్ని ప్రజలకు, పాలసీదారులకు తెలియచెప్పడానికి జనసభలు, వీధి సమావేశాలు దేశవ్యాప్తంగా నిర్వహించాలని అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం ఇప్పటికే పిలుపునిచ్చింది.

స్వదేశీ స్వదేశీ అని ఎప్పుడూ దేశ భక్తిని ప్రబోధిస్తూ, మేకిన్ ఇండియా నినాదంతో ఫేక్ స్లోగన్స్ ఇస్తూ ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేస్తున్న ఎన్‌డిఎ ప్రభుత్వ విధానాలు ఎండగట్టాలి. కార్మికులు, ప్రజలు ఉద్యమాలు నిర్మించి ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టడం ద్వారా మాత్రమే ఇది సాధ్యం

హెచ్‌పిసిఎల్ పరిశ్రమ

పారిశ్రామికాభివృద్ధిలో...

హెచ్‌పిసిఎల్ కీలక భూమిక

చరిత్రలోకి చూస్తే అనకాపల్లి, భీమిలి కనిపించినంతగా విశాఖ కనిపించదు. విశాఖ ఒక సాధారణ జాలరి పల్లెటూరు. కానీ నేడు ఆంధ్రప్రదేశ్‌లోనే పెద్దనగరం విశాఖ. ఈ నగరాభివృద్ధి ప్రధాన పాత్ర ప్రభుత్వ రంగ సంస్థలదే. వాటిల్లో ప్రధానమైనది కాల్‌టెక్స్ ఆయిల్ ఇండియా రిఫైనరీగా 1952లో స్థాపించబడి, 1976 హెచ్‌పిసిఎల్‌లో విలీనమైన నేటి విశాఖ రిఫైనరీ.

కెఎన్.సత్య,
ప్రధాన కార్యదర్శి,
హెచ్‌పిసిఎల్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు)

అయితే లాభదాయక చమురు శుద్ధి, వాటి ఉత్పత్తుల అమ్మకాన్ని ప్రభుత్వ రంగంలోకి రావడానికి చాలా చరిత్రే వుంది. పెట్రోలు, డీజల్, వంటగ్యాస్, ఇతర ఇంధనాలను సరఫరా చేసే ఈ రంగానికి మొత్తం ఆర్థిక వ్యవస్థనే ప్రభావితం చేయగల సత్తా ఉంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చే నాటికి, ప్రయివేటు రంగంలోని అమెరికా బహుళ జాతి సంస్థలు కాల్‌టెక్స్, ఎస్సో, షెల్‌లాంటి సంస్థలదే పైచేయిగా వుండేది.

1971 పాకిస్తాన్ యుద్ధకాలంలో యుద్ధ నౌకలు, విమానాలకు ఇంధనం సరఫరాకు నిరాకరించి, మన దేశ సైనిక అవసరాలకు వ్యతిరేకంగా పనిచేశాయి. దీంతో పార్లమెంటులో చట్టం చేసి, ఈ విదేశీ బహుళ జాతి సంస్థలను జాతీయం చేసి హెచ్‌పిసిఎల్, బిపిసిఎల్‌లను ఏర్పాటు చేశారు.

ప్రభుత్వ రంగ సంస్థగా ఆవిర్భవించిన తర్వాత మరింత సామాజిక బాధ్యతతో ఈ ప్రాంతం అభివృద్ధికి హెచ్‌పిసిఎల్ విశేషకృషి చేస్తోంది. కెజిహెచ్, పాఠశాలలు, పారిశుధ్యం కోసం నిధులను కేటాయిస్తుంది. నగర నడిబొడ్డున సిరిపురంలోని వాల్తేరు పార్క్ క్వార్టర్స్ హెచ్‌పిసిఎల్ ఉద్యోగుల నివాస కాలనీ, శ్రీహరిపురంలో వున్న యరాడ పార్క్ క్వార్టర్స్ పచ్చదనానికి, నగర అందాలకు ప్రత్యేకశోభను సంతరింపజేస్తున్నాయి.

ప్రజలకు సామాజిక న్యాయం జరగాలన్నా, ప్రయివేటు సంస్థల దోపిడీని అదుపులో పెట్టలన్నా అది ప్రభుత్వ రంగ సంస్థలకే సాధ్యం. ఆ లక్ష్యాన్ని నెరవేర్చడంలో హెచ్‌పిసిఎల్ తనదైన పాత్రను సమర్థవంతంగా నిర్వహిస్తుందనడంతో అతిశయోక్తి లేదు.

నగరాభివృద్ధిలో విశాఖ పోర్టు పాత్ర

(3వ పేజీ తరువాయి..)

రూ.171 కోట్లు పన్నులు చెల్లించింది. ఆస్తి పన్ను రూపంలో 2022లో రూ.62 కోట్లు, 2023లో రూ.71 కోట్లు గ్రేటర్ విశాఖ కార్పొరేషన్‌కు చెల్లించడం ద్వారా నగరంలో అనేక అభివద్ధి కార్యక్రమాలు చేపట్టడానికి దోహదపడింది. సామాజిక బాధ్యతగా అనేక అభివృద్ధి కార్యక్రమాలు కూడా సొంతంగా చేపడుతోంది. ఈ సంవత్సరం సుమారు రూ.35 కోట్లు సిఎస్‌ఆర్ నిధులను వివిధ ప్రాంతాల్లో విద్య, సామాజిక సేవలకు అందించింది. క్రీడా మైదానాలు, సాంస్కృతిక కేంద్రాలు కమ్యూనిటీ హాల్స్, విద్య, ఆరోగ్యం తదితర రంగాలలో అభివృద్ధికి ఎంతో కృషి చేస్తోంది.

తిరోగమన దిశలో

ఇంత అభివద్ధికి దోహదం చేస్తున్న విశాఖపోర్టు ప్రైవేటీకరణ వల్ల రోజురోజుకూ కార్మికులకు ఉపాధి అవకాశాలు తగ్గుతున్నాయి. దీంతోపాటు సామాజిక న్యాయం దెబ్బతింటోంది. పోర్టుకు వచ్చే ఆదాయం తగ్గడంతో నగర అభివృద్ధిపైన ప్రభావం పడుతుంది. కన్నతల్లివంటి విశాఖపట్నం పోర్టును బలహీనపరిచే చర్యలు కేంద్ర ప్రభుత్వం చేపట్టింది. పక్కనే గంగవరం మైనర్ పోర్టు ఏర్పాటుతో విశాఖ పోర్టుకు నష్టం వాటిళుతోంది. దీని వల్ల విశాఖపోర్టు దేశపట్టికలో 6వ స్థానానికి దిగజారింది. గత 7 సంవత్సరాల కాలంలో సుమారుగా 3000 మంది పర్మినెంట్ కార్మికులు తగ్గారు.

ప్రస్తుతం2800 మంది మాత్రమే ఉన్నారు. పోర్టులో ఇప్పటికే 8బెర్తులు పిపిపి, బిఒటి క్రింద అప్పగించారు. ఇప్పుడు మరో 6 బెర్తులు నేషనల్ మోనిటైజేషన్ పైపులైన్ (ఎన్.ఎం.పి.ఎస్) కింద ప్రైవేట్‌వారికి ఇచ్చారు. ఈ 6 బెర్తులు ప్రైవేట్‌పరం అయితే సుమారుగా 1500 మంది పర్మినెంట్, 1000 మంది కాంట్రాక్ట్ కార్మికులు పనికోల్పోతారు. పోర్టు క్వార్టర్లు, స్టేడియం, కల్యాణమండపాలు ప్రైవేట్‌వారికి అప్పజెప్పారు. ఈ క్రమం కొనసాగితే కార్గో హేండ్లింగ్ బాధ్యత నుంచి పూర్తిగా వైదొలగి పోర్టు కేవలం ఫెసిలిటేటర్ సంస్థగా మారుతుంది. ఈ సంస్థల నుంచి రాయల్టీ ద్వారా వచ్చే ఆదాయం స్వల్పం మాత్రమే. ఈ విధానాల వల్ల పెద్దఎత్తున పోర్టుకు రావాల్సిన ఆదాయం కోల్పోతుంది. ప్రైవేట్ సంస్థలు పెద్దఎత్తున లాభపడతాయి.

ప్రస్తుతం పోర్టు హాస్పిటల్‌ను ప్రయివేటుపరం చేసేందుకు టెండర్లు పిలిచారు. దీంతో 40వేల మంది ఆరోగ్య భద్రత ప్రశ్నార్థకంగా మారనుంది. విశాఖపట్నం పోర్టు ప్రజల ఆస్తి. ఇటువంటి పోర్టు, హాస్పిటల్ ప్రైవేటీకరణ కాకుండా కాపాడుకోవడంలో కార్మికులు, కార్మిక సంఘాలతో పాటు యావత్తు ప్రజానీకం కూడా ఉద్యమించి కాపాడుకోవాలి.

ప్రైవేటీకరణ కాబోతున్న రక్షణ రంగ పరిశ్రమలు

- రెడ్డి వెంకటరావు, చైర్మన్, డిఫెన్స్ కో-ఆర్డినేషన్ కమిటీ, విశాఖపట్నం

23వేల కిలోమీటర్ల సుదీర్ఘ భూ, సముద్ర తీరాల సరిహద్దులను, ప్రపంచంలోనే మూడవ సైనిక శక్తిగా ఉన్న భారత రక్షణ దళాలు కాపాడుతున్నాయి. వీటికి కావలసిన సాయుధ సంపత్తిని కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న పరిశ్రమలు ప్రధానంగా సమకూర్చుతున్నాయి. నిత్యం సరిహద్దుల్లో అలజడలు, ముఖ్యంగా చైనాతో జరిగిన యుద్ధం తరువాత భారత ఆయుధ పరిశ్రమలను బలోపేతం చేయాలని ఆనాటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ కంకణం కట్టుకున్నారు. ఆనాటికే ఉన్న ఆయుధ పరిశ్రమలను ఆధునికీకరించి, కొత్త వాటిని నెలకొల్పారు. ఆధునిక ఆయుధాలు తయారీకి రక్షణ ప్రయోగశాలలను స్థాపించారు. డాక్‌యార్డ్‌ల నిర్మాణం చేపట్టారు. ఈ విధంగా 41 ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలు, 52 డిఆర్‌డిఓ ప్రయోగశాలలు, 36 ఈఎంఈ వర్క్ షాపులు, అనేక మిలటరీ డెయిరీ ఫారాలు, డాక్ యార్డులు, షిప్ యార్డులు రక్షణ రంగంలో నెలకొల్పబడ్డాయి. ఇవి కాకుండా బీడీఎల్, హెచ్‌ఎఎల్ మొదలగు ప్రభుత్వ రంగ సంస్థలు రక్షణ రంగ పరికరాలను, ఆయుధాలను తయారు చేసేవి. బ్రిటిష్ కాలం నుండి ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ఆయుధ పరిశ్రమల్లోకి స్వదేశీ, విదేశీ పెట్టుబడిదారులు ప్రవేశించకుండా నాటి కేంద్ర ప్రభుత్వం కట్టుదిట్టమైన చట్టపరమైన చర్యలు తీసుకున్నది.

మేక్ ఇన్ ఇండియా పేరుతో ప్రైవేటీకరణ

సరళీకరణ విధానాలు నేపథ్యంలో రక్షణ రంగాన్ని ప్రైవేటీకరణకు ప్రభుత్వాలు పూనుకున్నాయి. స్వదేశీ జపంతో మేక్ ఇన్ ఇండియా పేరు చెప్పి అధికారం చేపట్టిన నేటి ప్రధాని నరేంద్ర మోడీ హద్దులు తొలగించుకొని రక్షణ రంగ సంస్థలన్నీ స్వదేశీ, విదేశీ బహుళజాతి గుత్త సంస్థల పరం అవుతున్నాయి. మోడీ ప్రధాని అయిన తర్వాత ఈఎంఈ వర్క్ షాపులు, మిలటరీ డెయిరీ ఫారాలు శాశ్వతంగా మూతపడ్డాయి. ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలను ఏడు స్వతంత్ర కార్పొరేషన్లుగా విడగొట్టారు. ఇవి తయారు చేసే ఉత్పత్తులను ప్రైవేటు వారికి అప్పగించి, ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ఆర్డినెన్స్ ఫ్యాక్టరీల సామర్థ్యానికి అనుగుణంగా ఆర్డర్లు ఇవ్వడం మానేశారు. నష్టాలు పేరు చెప్పి క్రమేపి వీటిని ప్రైవేటుపరం చేయాలని చూస్తున్నారు. వివిధ డాక్ యార్డ్‌ల్లో పనులను ఆఫ్ లోడింగ్ పేరుతో ప్రైవేట్ కాంట్రాక్టర్లకు అప్పగిస్తున్నారు. రక్షణ రంగ ప్రయోగశాలలకు అవసరమైన నిధులు కేటాయించకుండా నూతన పరిశోధనలకు మోకాలడ్డుతున్నారు. హెచ్‌ఎఎల్ తయారు చేసే యుద్ధ విమానాలు అంబానీకి, అణు జలాంతర్గాముల నిర్మాణాలను ఎల్ అండ్ టి కంపెనీకి అప్పగించారు. యుద్ధ నౌకల నిర్మాణం అంబానీ పరం కాబోతున్నది. ఒకనాడు దేశంలో సుమారు 5 లక్షల మంది డిఫెన్స్ సివిల్ ఉద్యోగులు, కార్మికులు రక్షణ రంగంలో పని చేయగా, నేటి మోడీ ప్రభుత్వ చర్యల వల్ల నేడు ఆ సంఖ్య రెండు లక్షలకు తగ్గిపోయింది.

1941లో రెండో ప్రపంచ యుద్ధ కాలంలో యుద్ధ నౌకల రిపేర్లకు నేటి విశాఖ నావెల్ బేస్‌లో బేస్ రిపేర్ యార్డ్ (బిఆర్‌ఓ) ఆయుధ గిడ్డంగి (ఎన్‌ఎడి)లకు అంకురార్పణ జరిగింది. చైనాతో యుద్ధం తర్వాత తూర్పు నౌకాదళ విస్తరణతో పాటు, బేస్ రిపేర్ యార్డ్‌గా ఉన్న చిన్న రిపేర్ వర్క్ షాపును, ఆధునిక యుద్ధ నౌకలు, జలాంతర్గాముల మరమ్మతులకు అవసరమైన ఆధునిక నావెల్ డాక్‌యార్డ్, ఆసియాలోనే అతిపెద్దదైన డ్రై డాక్‌ల నిర్మాణానికి ఆనాటి కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. మెటీరియల్ ఆర్గనైజేషన్, డబ్ల్యూడి, సిటిడబ్ల్యూ, బివి యార్డ్ మొదలగు అనుబంధ సంస్థలు నిర్మించబడ్డాయి. ఇదే కాలంలో ఎన్ఎస్‌టిఎల్ నిర్మాణం చేపట్టారు. నావెల్ ప్రాజెక్టులు నిర్మాణానికి డైరెక్టర్ జనరల్ ఆఫ్ నావెల్ ప్రాజెక్ట్స్ (డిజిఎన్‌పి), నిర్వహణకు మిలటరీ ఇంజనీరింగ్ సర్వీస్ (ఎంఈఎస్)లు ఈ కాలంలోనే విస్తరించారు. 1989 తర్వాత షిప్ బిల్డింగ్ సెంటర్ నిర్మాణం చేపట్టారు. 1980 దశకంలో విశాఖ రక్షణ రంగంలో 15,000 మంది పర్మినెంట్ కార్మికులు, ఉద్యోగులు పనిచేసేవారు. నేడు ఆ సంఖ్య 8 వేలకు తగ్గిపోయింది.

ఆయుధాలు భద్రపరచడంతో పాటు వాటిని నిర్వహించే ఎన్‌ఎడి పనులను కూడా ప్రైవేటు వారికి అప్పగిస్తున్నారు. అనకాపల్లి జిల్లా రాంబల్లి దగ్గర అంబానీ డిఫెన్స్ యూనిట్ వస్తే.. దేశీయ రక్షణ రంగ సంస్థలతో పాటు విశాఖ రక్షణ రంగ సంస్థలు దెయ్యాల కొంపలుగా మారే పరిస్థితి వస్తుంది. రక్షణ రంగ పరిశ్రమలు ప్రైవేటుపరమైతే పెట్టుబడిదారులకు కాసులు పండిస్తాయి. ఉగ్రవాదులకు, విచ్ఛిన్నకర శక్తులకు ఆయుధాలు అందుబాటులోకి వస్తాయి. ప్రజల ప్రాణాలకు, దేశభద్రతకి, రక్షణకి ప్రమాదం ముంచుకొని వస్తుంది. అలా జరగకుండా ఉండాలంటే ప్రస్తుత విధానాలను మార్చడానికి ఐక్య పోరాటాలు చేయడమే శరణ్యం.

బిఎస్‌ఎన్‌ఎల్ అమూల్య సేవలు

- కె.రమాదేవి,
సర్కిల్ సెక్రటరీ, బిఎస్‌ఎన్‌ఎల్ ఎంప్లాయీస్ యూనియన్, ఆంధ్రప్రదేశ్

దేశ టెలికం రంగంలో బిఎస్‌ఎన్‌ఎల్ సేవలు అమూల్యమైనవి. స్వాతంత్ర్యానంతర కాలంలో ఈ సంస్థ ప్రజలకు మెరుగైన సేవలందించింది. ప్రతి మారుమూల పల్లెనూ పలకరించింది. అయితే, నయాఉదారవాద విధానాలు వచ్చాక, అందునా మోడీ సర్కారు కేంద్రంలో అధికారంలోకి వచ్చాక సంస్థ రానురానూ దిగజారింది. 4జి, 5జి సాంకేతిక పరిజ్ఞానం లేని కారణంగా భారీ మూల్యం చెల్లించాల్సి వస్తోంది. అయితే తాజాగా ప్రైవేటు టెలికం ఆపరేటర్లు వినియోగదారుల సెల్ టారిఫ్ ఛార్జీలను విపరీతంగా పెంచేయడంతో ప్రస్తుతం ఎక్కువ మంది బిఎస్‌ఎన్‌ఎల్‌వైపు చూస్తున్నారు. చౌకైన ధరతో సేవలను అందించే బిఎస్‌ఎన్‌ఎల్ 4జి, 5జిని తేవాలని వారంతా ఆకాంక్షిస్తున్నారు. ఆ మాటలు ప్రభుత్వం చెవికెక్కడం లేదు.

అక్టోబర్ 23 నాటికి మొబైల్ ఫోన్లలో బిఎస్‌ఎన్‌ఎల్ మార్కెట్ వాటా 8.08 శాతం. సాంకేతిక పరిజ్ఞానం అప్డేట్‌కాని కారణంగా కొంతకాలంగా సుమారు రెండు కోట్ల మంది వినియోగదారులను బిఎస్‌ఎన్‌ఎల్ కోల్పోయింది. అయితే, నెట్‌వర్క్ లేకపోవడం, కాల్‌డ్రాప్ అవడం వంటి ఎన్ని అవరోధాలు వచ్చినా ప్రభుత్వ రంగ సంస్థలను బలపర్చాలని ప్రగతిశీల వ్యక్తులు అనుకోబట్టే బిఎస్‌ఎన్‌ఎల్ ఇంకా 10 కోట్ల మంది పైచిలుకు వినియోగదారులను కలిగి ఉంది.

2014లో మన దేశంలో 4జి సేవలను ప్రారంభించారు. కానీ కేంద్రం 4జి స్పెక్ట్రంలో బిఎస్‌ఎన్‌ఎల్‌కు ఏ కేటాయింపూ చేయలేదు. ఉద్యోగ సంఘాలు, అధికారుల సంఘాలు దీర్ఘకాలం పాటు ఆందోళన చేశాక 2019 అక్టోబర్‌లో అనుమతి లభించింది. బిఎస్‌ఎన్‌ఎల్ వద్ద 4జి టెక్నాలజీకి అనువుగా ఉండే బిటిఎస్‌లు 49,300 ఉన్నాయి. వీటిని పూర్తి స్థాయి 4జి బిటిఎస్‌లుగా అప్‌గ్రేడ్ చేస్తే దేశవ్యాప్తంగా బిఎస్‌ఎన్‌ఎల్ 4జి సేవలను అందించగలిగేది. కానీ ఆ విధంగా అప్‌గ్రేడ్ చేయడానికి కేంద్రం అనుమతి నిరాకరించింది. దాని వల్ల బిఎస్‌ఎన్‌ఎల్ 4జి సేవలను 2023 వరకు ప్రారంభించలేకపోయింది. ఇంకోపక్క ఉన్న బిటిఎస్‌లను అప్‌గ్రేడ్ చేయడానికి ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు. కనుక మార్చి 2020లో బిఎస్‌ఎన్‌ఎల్ 50000 బిటిఎస్‌లను కొత్తగా కొనుగోలు చేయడానికి గ్లోబల్ టెండర్లను పిలిచింది. నోకియా, ఎరిక్‌సన్, సామ్‌సంగ్ వంటి కంపెనీలు మాత్రమే వీటిని సరఫరా చేయగల సామర్థ్యం కలిగివున్నాయి. ప్రభుత్వం మళ్ళీ అడ్డుపడింది. భారతదేశంలోని అమ్మకందారుల వద్ద నుండి మాత్రమే వాటిని కొనుగోలు చేయాలన్న షరతు పెట్టింది. కానీ భారతదేశంలో వాటిని సరఫరా చేయగలిగిన కంపెనీలు ఏవీ లేవు. ఇంకోపక్క ఎయిర్‌టెల్, జియో, వొడాఫోన్ ఐడియా వంటి కంపెనీలు మాత్రం గ్లోబల్ టెండర్ల ద్వారా వాటికి కావలసిన పరికరాలను కొనుగోలు చేసుకున్నాయి. ఆ ప్రైవేట్ కంపెనీల మీద ప్రభుత్వం ఎటువంటి షరతులనూ పెట్టలేదు. ప్రైవేటు కంపెనీలకు పోటీగా బిఎస్‌ఎన్‌ఎల్ రంగంలోకి దిగకుండా ఉండడానికే కేంద్ర ప్రభుత్వం తన సొంత సంస్థ కాళ్లు, చేతులు కట్టివేసింది. ఆ సంస్థలన్నీ మొత్తం మార్కెట్‌ను ఆక్రమించుకుని ఉన్నాయి. ఇప్పుడు వినియోగదారులపై ఛార్జీల భారం వేస్తున్నాయి. ఎయిర్‌టెల్, జియో, వొడాఫోన్ ఐడియాలు తమ టెలిఫోన్ టారిఫ్‌లను పెంచిన కారణంగానూ, ఇప్పుడిప్పుడే 4జి సేవలను బిఎస్‌ఎన్‌ఎల్ తెస్తున్నందున మరలా లక్షల సంఖ్యలో కస్టమర్లు బిఎస్‌ఎన్‌ఎల్‌వైపు తిరిగి వస్తున్నారు.

దేశానికి వెన్నెముక ప్రభుత్వ రంగం

(3వ పేజీ తరువాయి..) వ్యవసాయ రంగంలో పరిశోధనల ద్వారా అధిక దిగుబడి సాధించడం, నీటి ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయడం, వ్యవసాయోత్పత్తులకు గిట్టుబాటు ధరలు గ్యారంటీ చేయడం, ఎరువులు తదితర ఇన్‌పుట్స్‌కు సబ్సిడీలు ఇవ్వడం వంటి విధానాలు మన ఆహార స్వావలంబన సాధనకు దారి తీశాయి. ఇప్పుడు మోడీ ప్రభుత్వం నల్ల వ్యవసాయ చట్టాల ద్వారా వాటన్నింటినీ రద్దు చేసి మళ్లీ తిండి కోసం ఇతర దేశాలను చిప్ప పట్టుకుని అడుక్కునే స్థితికి తీసుకుపోవాలని చూస్తోంది.

శాస్త్ర, సాంకేతిక రంగాలలో ప్రతిష్టాత్మకమైన ఐఐటిలు, ఐఐఎంలు, ఎయిమ్స్ సంస్థలు, డిఆర్‌డిఒ ల్యాబ్స్, వంటివి నెహ్రూ కాలంలోనే ప్రారంభమయ్యాయి. 1949 నాటికి కేవలం రూ.10 కోట్లు మాత్రమే శాస్త్ర సాంకేతిక పరిశోధనలకు కేటాయించిన పరిస్థితి నుండి 1977 నాటికి రూ.4500 కోట్లు కేటాయించే స్థాయికి ఎదిగామంటే ఈ విధానాలే కారణం. మళ్ళీ మోడీ కాలంలో ఈ కేటాయింపులన్నీ తగ్గిపోయి ఇతర దేశాల కన్నా చాలా దారుణంగా వెనుకబడిపోతున్నాం. విద్యా, వైద్య రంగాలలో, పేదరిక స్థాయిని తగ్గించడంలో, సామాజిక న్యాయాన్ని ఆచరించడంలో మన దేశం ఎన్నో విజయాలను సాధించింది.

ఇంత విశిష్టత ఉన్న నెహ్రూ కాలపు విధానాలను ప్రజానీకం మరిచిపోయేలా చేసినప్పుడే మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు దేశ సంపదను దోచిపెట్టడం తేలికౌతుంది. అందుకే నెహ్రూ మీద విషం కక్కుతున్నారు. కానీ దేశభక్తులు, కార్మికులు, ప్రజాస్వామ్యవాదులు, రైతులు అందరూ ఈ కుట్రలను సాగనివ్వకుండా ప్రతిఘటిస్తున్నారు. ఈ ప్రతిఘటనను మరింత విస్తృతంగా, శక్తివంతంగా ముందుకు తీసుకుపోవాలి. అదే మనందరిముందున్న కర్తవ్యం.

హిందుస్తాన్ షిప్‌యార్డు లిమిటెడ్

నౌకల నిర్మాణంలో దిట్ట హెచ్‌ఎస్‌ఎల్

- కెఎం.కుమారమంగళం, పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ నాయకులు

అతి తక్కువ ఖర్చుతో సరకుల రవాణాకు ఏ దేశానికైనా నౌకలు చాలా అవసరం. ప్రపంచవ్యాప్తంగా నౌకా నిర్మాణ మార్కెట్ 2023లో 207.15 బిలియన్ డాలర్లు ఉండగా 2024 నాటికి 220.52 బిలియన్ డాలర్ల వృద్ధి నమోదు చేసింది. ఇది 6.5శాతం వృద్ధిని కలిగి ఉన్నది. నౌకా నిర్మాణ రంగంలో చైనా, సౌత్ కొరియా, జపాన్‌లు 94శాతం దగ్గర మార్కెట్ ఆధిపత్యాన్ని కలిగి ఉన్నాయి. భారతదేశం ప్రపంచ నౌకా నిర్మాణ రంగంలో 0.6శాతం మార్కెట్ భాగస్వామ్యం మాత్రమే కలిగి ఉంది. నౌకా నిర్మాణ రంగంలో పాసింజర్, కార్గో నౌకల ఎగుమతుల్లో 2023లో 25 బిలియన్ డాలర్లతో చైనా అగ్రస్థానంలో నిలిచింది. 16.7 బిలియన్ డాలర్లతో సౌత్ కొరియా 2వ స్థానంలో, 9.6 బిలియన్ డాలర్ల సామర్థ్యంతో ఎగుమతులతో జపాన్ 3వ స్థానంలో నిలిచింది. ఇండియా కేవలం 1.12 బిలియన్ డాలర్ల ఎగుమతి మాత్రమే చేయగలిగింది.

7,517 కిలోమీటర్ల విస్తారమైన తీరప్రాంతం కలిగిన భారత దేశ వాణిజ్య, రక్షణ అవసరాలకు నౌకలు కలిగి ఉండడం మరింత కీలకం. ప్రపంచ వ్యాప్తంగా ప్రభుత్వ సహకారం లేకుండా నౌకానిర్మాణ రంగం మనుగడ సాగించిన పరిస్థితి లేదు. 80వ దశకంలో అంతర్జాతీయ సంక్షోభ పరిస్థితుల నేపథ్యంలో అమెరికాతో సహా నౌక నిర్మాణ దేశాలన్నీ వారి పరిశ్రమల రక్షణకు సబ్సిడీలు అందిస్తే.. భారతదేశం విదేశాల్లో నౌకల కొనుగోలుకు 30శాతం సబ్సిడీ ఇచ్చింది. స్వాతంత్ర్యం వచ్చే నాటికి కోల్‌కత్తా, ముంబయి ప్రాంతాలలో చిన్న చిన్న నౌకా నిర్మాణ కేంద్రాలు రమారమి 12 ఉండగా, నేడు 30 ఉన్నాయి. వీటిల్లో 8 ప్రభుత్వరంగ సంస్థలుగా కొనసాగుతున్నాయి.

హిందూస్థాన్ షిప్‌యార్డు..

స్వాతంత్ర్య పోరాటం ఫలించే నేపథ్యంలో వాల్ చంద్ హీరా చంద్ 1944లో సింధియా స్టీమ్ నెవిగేషన్ కంపెనీ పేర (నేటి హిందూస్థాన్ షిప్పియార్డు) 8,000 డిడబ్ల్యూటి నిర్మాణ సామర్థ్యం కలిగిన రెండు స్లిప్ వేస్‌తో నౌకనిర్మాణ సంస్థను ఏర్పాటు చేశారు. తరువాత కాలంలో షిప్పియార్డును నడపలేక మూసివేయడానికి వాల్ చంద్ హీరా చంద్ సిద్ధపడగా నాటి నెహ్రూ ప్రభుత్వం 1951లో కొంతమేర, 1961 నాటికి పూర్తిగా ప్రభుత్వ రంగంలోకి తీసుకోవటం జరిగింది. హిందూస్థాన్ షిప్పియార్డు అనేక సంక్షోబాలను ఎదురుకొంటూ నేటికి 200 పైబడి అధిక సామర్థ్యం కలిగిన నౌకల నిర్మాణం చేసింది. వాణిజ్య నౌకలు, దేశరక్షణకు అవసరమైన యుద్ధ నౌకలు, తీరప్రాంత గస్తీ నౌకలు, రిగ్‌లతో పాటు సముద్ర గర్భంనుండి చమురు వెలికితీయడానికి అవసరమైన ప్లాట్ ఫామ్‌ల నిర్మాణలతో పాటు పరిశోధన అవసరాలకు కావాల్సిన అనేక వైరుధ్యం కలిగిన నౌకల నిర్మాణం చేసిన ఘనత హిందూస్థాన్ షిప్పియార్డు సొంతం. 2000 పైబడి నౌకలు, జలాంతర్గాముల రీఫిటింగ్‌తో సహ మరమ్మతులు చేసింది.

నిర్వీర్యం చేస్తున్న మోడీ ప్రభుత్వం

కేంద్రంలోని బిజెపి ఎన్‌డిఎ ప్రభుత్వం ప్రభుత్వ రంగ పరిశ్రమల నిర్వీర్యం, ప్రైవేటీకరణ వేగవంతం చేసింది. పరిశ్రమలు నడపడం ప్రభుత్వ పని కాదని, ప్రభుత్వరంగ పరిశ్రమలు చనిపోవడానికి పుట్టాయని, కొన్ని వెంటనే చనిపోతే మరికొన్ని రానున్న కాలంలో చనిపోతాయని, లేని పక్షంలో వాటిని తామే చంపేస్తామని ప్రధాని మోడీ 2014లోనే మొట్టమొదటి టీవీ ఇంటర్వ్యూలో చెప్పారు. అందులో భాగంగానే ప్రభుత్వ రంగ పరిశ్రమలపై వివిధ కోణాలలో ప్రభుత్వం చేస్తున్న దాడిని మనం గమనించవచ్చు.

మోడీ ప్రభుత్వం తన విజన్ డాక్యుమెంట్లో 2030 నాటికి నౌకా నిర్మాణరంగంలో అంతర్జాతీయంగా 10వ స్థానానికి, 2047 నాటికి 5వ స్థానానికి ఎదగాలని నిర్దేశించుకున్నా.. వాస్తవంలో దానికి అనుగుణంగా నౌకా నిర్మాణరంగాన్ని బలోపేతం చేసే చర్యలు శూన్యం. 53వేల డిడబ్ల్యూటి సామర్థ్యం కలిగిన వాణిజ్య నౌకలను నిర్మించగలిగే హిందుస్థాన్ షిప్ యార్డ్ జిఎంఎల్ ఆర్డర్ తర్వాత వాణిజ్య నౌకల నిర్మాణాన్ని చేపట్టలేదు. టర్కీతో ఎఫ్‌ఎస్‌ఎస్ నౌకల నిర్మాణం రద్దయిన నేపథ్యంలో హిందుస్థాన్ షిప్ యార్డ్ లిమిటెడ్‌కు 19 వేల కోట్ల విలువైన ఎఫ్‌ఎస్‌ఎస్ ఆర్డర్లను ఇచ్చినట్లే ఇచ్చి దొడ్డిదారిలో ఎల్ అండ్ టికి రెండు నౌకల నిర్మాణ బాధ్యతలను అప్పగించింది. రానున్న కాలంలో మిగిలిన నౌకలను కూడా ఇతర కారణాలను చూపి ఎల్ అండ్ టికి గాని, వేరే ఇతర ప్రైవేటు సంస్థలకు గాని మోడీ ప్రభుత్వం అప్పగించదని గ్యారెంటీ ఏమీ లేదు.

ప్రపంచవ్యాప్తంగా నౌక నిర్మాణ రంగాన్ని ఉపాధి కల్పనలో కీలక రంగంగా గుర్తిస్తారు. దీనికి భిన్నంగా భారతదేశంలో ప్రభుత్వ రంగ పరిశ్రమలలో విఆర్‌ఎస్ పేర ఉద్యోగ విరమణ వలన కార్మికులు తగ్గిపోతున్నా ఆ ఖాళీల్లో నిపుణత కలిగిన కార్మికులతో భర్తీ చేయడం లేదు. 1977లో హిందూస్థాన్ షిప్‌యార్డ్‌లో 7133 మంది కార్మికులు పని చేయగా, నేడు అధికార్లతో సహా 580 మంది మాత్రమే పర్మినెంట్ కార్మికులు పనిచేస్తున్నారు.

స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత ప్రణాళిక బద్ధమైన అభివృద్ధి ద్వారా నిర్మితమైన ప్రభుత్వ రంగాన్ని మోడీ ప్రభుత్వం ప్రైవేటీకరణ చేస్తోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ రంగ పరిశ్రమల పరిరక్షణకు కార్మిక వర్గంతో పాటు ప్రజాబాహుల్యాన్ని కలుపుకొని నిరంతరం పోరాటం కొనసాగించాలి. తద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపరుచుకోవడం, ప్రజాధనంతో నిర్మితమైన ప్రభుత్వ రంగాన్ని కాపాడుకోవడం నేటి ప్రధాన కర్తవ్యం.

ఆర్థిక వ్యవస్థకు జీవనాడి బ్యాంకులు

నేడు ప్రైవేటీకరణ కత్తి

ఏ కార్పొరేట్ల వల్ల ప్రభుత్వ రంగ బ్యాంకులలో భారీగా పారు బకాయిలు పెరుగుతున్నాయో, వారి ప్రయోజనాల కోసం ప్రభుత్వ రంగ బ్యాంకులను ప్రైవేటీకరించాలని చూడటం, వారికి బ్యాంకులను అప్పగించాలని చర్యలు తీసుకోవడం దురదష్టకరం. ప్రభుత్వ రంగ బ్యాంకులకు సరిపడినంత మూలధనాన్ని పెంచాలని, ఉద్దేశ్యపూర్వకంగా బ్యాంకు అప్పులు ఎగ్గొడుతున్న వారి ముక్కు పిండి బాకీలు వసూలు చేసేలా కఠిన చట్టాలు రూపొందించాలని, ప్రభుత్వ రంగ బ్యాంకుల ప్రైవేటీకరణ విడనాడాలని కార్మిక వర్గం, దేశభక్తి కలిగిన ప్రజలు ఉవ్వెత్తున పోరాటాలు నిర్వహించాల్సి వుంది. నరేంద్ర మోడీ ప్రభుత్వం తొమ్మిదేళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంలో అంటే 2023లో బ్యాంకుల ప్రైవేటీకరణ షెడ్యూల్ ప్రకారం ముందుకు సాగుతుందని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. దేశ విశాల ప్రయోజనాలను పట్టించుకోకుండా ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటీకరించే చర్యలు తీసుకుంటుండడం సమర్ధనీయం కాదు!! ఆర్థికమంత్రి ప్రకటన బట్టి ప్రభుత్వ రంగ బ్యాంకులను ప్రైవేటుపరం చేయడం ప్రభుత్వ ప్రాధమ్యంగా మారిందని అర్థం అవుతోంది.

1969కి ముందు అనేక సందర్భాలలో పార్లమెంటులో వామపక్ష పార్లమెంట్ సభ్యులు బ్యాంకులను జాతీయం చేయాలన్న డిమాండును లేవనెత్తుతూ వచ్చారు. దేశంలో ఆదాయాల పంపిణీ ఏ తీరుగా ఉందో అధ్యయనం చేసిన పి.సి.మహల్‌నోబిస్ కమిటీ 1960 నాటికి దేశంలోని పది శాతం మంది సంపదలో 40 శాతం వాటా పొందుతున్నారని తేల్చింది. దేశంలో గుత్తసంస్థల తీరును అధ్యయనం చేసిన మోనోపలీస్ ఎంక్వైరీ కమిషన్ 1964 నాటికి దేశంలోని పరిశ్రమలలో 85 శాతం కొద్దిపాటి గుత్తసంస్థల చేతుల్లో ఉన్నాయని తెలిపింది. 1947-1951 మధ్య 205 ప్రయివేటు బ్యాంకులు బోర్డులు తిప్పేశాయి. 1951లో 567 ప్రయివేటు బ్యాంకులు ఉంటే 1969 నాటికి అవి కాస్తా 91 అయ్యాయి. ప్రైవేటు బ్యాంకులెంత దివాలా తీశాయో దీనినిబట్టి స్పష్టం అవుతున్నది.

1969లో బ్యాంకుల జాతీయకరణపై పార్లమెంట్‌లో జరిగిన చర్చలో ఆనాడు యువ పార్లమెంట్ సభ్యునిగా ఉన్న అటల్ బిహారీ వాజ్‌పేయి పాల్గొని, బ్యాంకుల జాతీయకరణను వ్యతిరేకిస్తూ 4 అంశాలు పేర్కొన్నారు. బ్యాంకుల జాతీయకరణ ఒక వికృతమైన చర్య అని, అవసరం లేనిదనీ అకారణమైనదనీ, అనుచితమని పేర్కొన్నారు. ఇది ప్రభుత్వ రంగ సంస్థల పట్ల బిజెపి వైఖరికి నిలువెత్తు తార్కాణం. అయితే, ఆనాడు కాంగ్రెస్, వామపక్ష పార్టీలు బ్యాంకు జాతీయకరణకు పట్టు పట్టడం వల్లనే అది సాకారం అయ్యింది.

బ్యాంకుల జాతీయకరణ (1969, 1980) జరిగిన నాటి నుండి బ్యాంకింగ్ రంగం గణనీయంగా పురోగతి సాధించింది. 1969లో మన దేశంలో మొత్తం ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఉన్న డిపాజిట్ల మొత్తం రూ. 5000 కోట్లు కాగా, 2021 నాటికి అవి రూ.157 లక్షల కోట్లకు పెరిగాయి. గ్రామీణ ప్రాంతాల్లో, మారుమూల ప్రాంతాల్లో సైతం పెద్ద ఎత్తున బ్యాంక్ శాఖలు ప్రారంభించిన ఘనత ప్రభుత్వ రంగ బ్యాంకులదే. 1969లో మొత్తం బ్యాంక్ శాఖల సంఖ్య 8000 కాగా, 2021 నాటికి ఆ సంఖ్య 1,18,000కు పెరిగింది. ఆర్థిక వ్యవస్థలో కీలక రంగాలైన వ్యవసాయం, గ్రామీణాభివద్ధి, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, విద్య, ఆరోగ్యం, మౌలిక సదుపాయాల కల్పన వంటి రంగాలు విశేష ప్రయోజనం పొందడంలో ప్రభుత్వ రంగ బ్యాంకులు కీలకపాత్ర పోషించాయి.

దేశంలో బ్యాంకింగ్ రంగ చిత్రం 1991 నుండి పెనుమార్పులకు లోనయింది. ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకుల ఒత్తిడికి తలొగ్గిన ప్రభుత్వాలు నయా ఉదారవాద విధానాలను అమలు చేయడం ప్రారంభించాయి. ఎవరికైనా రూ. ఒక కోటికి మించి రుణం ఇవ్వాలంటే రిజర్వుబ్యాంకు నుండి ముందస్తు అనుమతి ఉండాలన్న నిబంధనను తొలగించారు. వ్యవసాయం, సంబంధిత రంగాలకు, బలహీన వర్గాలకు రుణాలు ఇవ్వడం ప్రథమ ప్రాధాన్యతగా ఉండాలన్న విధానాన్ని ఆచరణలో అమలు చేయకుండా నీరుగార్చారు. గుత్తపెట్టుబడుల నిరోధ చట్టం (ఎంఆర్‌టి.పి యాక్టు)ను రద్దుచేశారు. క్రమేపీ బ్యాంకింగ్ రంగంలో విదేశీ పెట్టుబడుల శాతాన్ని 74 శాతానికి పెంచారు. అనేక ప్రభుత్వ బ్యాంకుల్లో ప్రభుత్వ వాటాలను దాదాపు 40 శాతం పైగా అమ్మివేశారు. దీంతో బ్యాంకుల ప్రైవేటీకరణకు మార్గం సుగమం అయ్యింది. 2008లో వచ్చిన ప్రపంచ ఆర్థిక సంక్షోభంలో అభివద్ధి చెందిన దేశాలన్నింటిలోనూ వందల సంఖ్యలో ప్రైవేట్ బ్యాంకులు దివాలా తీశాయి. 180 ఏళ్ల చరిత్ర కలిగిన లెహమాన్ బ్రదర్స్, జేపీ మోర్గాన్ ఛేజ్, గోల్డ్ మ్యాన్ శాక్స్, బ్యాంక్ ఆఫ్ అమెరికా, మోర్గాన్ స్టాన్లీ, మెరిన్ లించ్, లాయిడ్స్, బ్యాంక్ ఆఫ్ స్కాట్లాండ్ వంటి అంతర్జాతీయ బ్యాంకింగ్ దిగ్గజాలు సైతం కేవలం మొండి బకాయిల కారణంగా కుప్పకూలాయి. ఇవన్నీ ప్రభుత్వ ఉద్దీపన ప్యాకేజీ ద్వారా, ప్రజల సొమ్మును వాటిలో పెట్టుబడులు పెట్టడం ద్వారా మాత్రమే నిలదొక్కుకున్నాయి.

2008 ఆర్థిక సంక్షోభం నుంచి మన దేశం నిలదొక్కుకొని గట్టెక్కడానికి ప్రభుత్వరంగ బ్యాంకులే ముఖ్య కారణమని ప్రపంచ దేశాలు కొనియాడాయి. మరి మన దేశంలో ప్రైవేటీకరణ తర్వాత మన బ్యాంకులు దివాలా తీస్తే వాటికి జవాబుదారు ఎవరు? ప్రజల సొమ్ముకు ఎవరు బాధ్యత వహిస్తారు? ప్రభుత్వ రంగ బ్యాంకుల ప్రయివేటీకరణ దేశాభివద్ధిని వెనుక బాట పట్టించడమే గాక, ప్రజల కష్టార్జితాన్ని, విలువైన పొదుపును ప్రయివేటు వారికి, కార్పొరేట్లకు అప్పగించడం అవుతుంది. ప్రైవేటీకరణ సమర్ధకులు ప్రభుత్వాల ప్రైవేటీకరణ విధానాలను సమర్థించేందుకు ప్రభుత్వ రంగ బ్యాంకులపై లేనిపోని అభాండాలను మోపుతున్నారు. ప్రభుత్వ రంగ బ్యాంకులు నష్టాల్లో ఉన్నాయన్న వాదనలు ఈ కోవలోనివే. గత మూడేళ్ళుగా ప్రభుత్వ రంగ బ్యాంకులు రూ.2 లక్షల కోట్ల నిర్వహణ లాభాలు ఆర్జిస్తున్నాయి.గత పదిహేనేళ్లలో ప్రభుత్వ రంగ బ్యాంకులు ఆర్జించిన మొత్తం నిర్వహణ లాభాలు రూ. 20,43,278 కోట్లు.

ప్రభుత్వ పెద్దల అనుయాయులు బ్యాంకుల నుంచి తీసుకున్న అప్పులు భారీగా ఎగ్గొట్టడం వల్ల మాత్రమే, ప్రభుత్వ రంగ బ్యాంకులకు నష్టాలు వస్తున్నాయి. గత ఆరేళ్లలో ప్రభుత్వ బ్యాంకుల 11 లక్షల కోట్ల రూపాయల పారు బకాయిలను మాఫీ చేశారు. ప్రభుత్వ బ్యాంకుల పారు బకాయిల్లో 73 శాతం హెయిర్ కట్ చేస్తున్నారు. 'హెయిర్ కట్' పేరుతో భారీ బకాయిలు పడిన సంస్థలను అతితక్కువ మొత్తం చెల్లించి బడా గుత్తసంస్థలు చేజిక్కించుకోగలుగుతున్నాయి. ఇది ఉద్దేశ్య పూర్వకంగా బ్యాంక్ రుణాలు ఎగ్గొడుతున్న బడా బాబులపై ప్రభుత్వాలకున్న జాలి, దయ!!

రైల్వేల తర్వాత ఎక్కువ మందికి ఉపాధి కల్పించేది ప్రభుత్వ బ్యాంకింగ్ రంగం. దేశంలో పెద్దఎత్తున వ్యవసాయ రంగానికి రుణాలిచ్చి వెన్నుదన్నుగా నిలుస్తున్నది ప్రభుత్వ బ్యాంకులే. చదువుకున్న, వెనుకబడిన, షెడ్యూల్డ్ కులాల వ్యక్తులకు రిజర్వేషన్ల ద్వారా ఉపాధి, ఆర్థిక సాయం కల్పిస్తున్నది ప్రభుత్వ బ్యాంకింగ్ రంగమే. ఫైనాన్షియల్ ఇంక్లూజన్ పేరుతో 50 కోట్లపై చిలుకు 'జన్‌ధన్' ఖాతాలను తెరిచింది ప్రభుత్వ బ్యాంకులే. కేంద్ర ప్రభుత్వం నిర్వహించమన్న సామాజిక పథకాలను కేవలం ప్రభుత్వ రంగమే నిర్వహిస్తోంది. ప్రధాన మంత్రి పేరు మీద ఉన్న జీవన జ్యోతి బీమా యోజన, జనశ్రీ బీమా యోజన పథకాలలో ఎల్ఐసి, ప్రభుత్వ రంగ సాధారణ బీమా సంస్థల భాగస్వామ్యం 96 శాతం ఉంటే, ప్రైవేటు బీమా సంస్థల భాగస్వామ్యం కేవలం 4 శాతం మాత్రమే. జన్ ధన్ యోజన పథకం లో ప్రభుత్వరంగ బ్యాంకుల వాటా 97 శాతం ఉంటే, ప్రయివేటు బ్యాంకుల వాటా కేవలం 3 శాతం. ఇవి ప్రభుత్వ గణాంకాలు!! నష్టాలు వచ్చే సామాజిక పథకాల్లో ప్రయివేటు బ్యాంకులు, బీమా సంస్థల పాత్ర నామమాత్రంగా ఉంది !! అయినా, ప్రభుత్వ రంగ బ్యాంకు, బీమా కంపెనీల ప్రైవేటీకరణకు ప్రభుత్వం దూకుడుగా ముందుకు సాగడం తీవ్ర అభ్యంతరకరం.

- పి.సతీష్, ఎఐఐఇఎ ఉపాధ్యక్షులు

స్టీల్‌ప్లాంట్, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవాలి

ప్రభుత్వ రంగ సంస్థలను చంపేస్తున్నారు

అదాని, అంబాని వంటి ప్రయివేటు వ్యక్తుల కోసమే ప్రభుత్వ రంగ సంస్థలను చంపేస్తున్నారు. నెహ్రూ ప్రభుత్వ రంగ సంస్థలను ఆధునిక దేవాలయాలుగా వర్ణిస్తే, ప్రస్తుతం కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలు ఎప్పటికైనా చచ్చిపోతాయని, కొన్ని యవ్వనంలో, కొన్ని వృద్ధాప్యంలో చచ్చిపోతాయి అన్నట్టుగా ప్రవర్తించడం శోచనీయం. ప్రభుత్వ రంగ సంస్థల్లో స్టీల్ ఉత్పత్తి జరగటం వల్ల టన్ను ధర రూ.50 వేలు నుంచి రూ.55 వేలు మాత్రమే ధర పలుకుతోంది. అదే స్టీల్ పరిశ్రమ ప్రయివేటుపరమైతే టన్ను ధర రూ.లక్షల్లోకి వెళుతుందని గుర్తించాలి. ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఐడిబిఐఎల్‌ను నిర్వీర్యం చేయడంతో, ప్రస్తుతం ప్రయివేటు ఫార్మాసిటీ కంపెనీలు ప్రజల్ని ఎలా పిండుకుంటున్నాయో ప్రత్యక్షంగా చూస్తున్నాం. స్ట్రాటజిక్, నాన్ స్ట్రాటజిక్ అంటూ బలమైన సంస్థలను ప్రయివేటుకు అప్పగించే కుట్రలు మానుకోవాలి.

– జె.అయోధ్యరామ్, గౌరవాధ్యక్షులు
స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు)

నాటి ప్రధాని నెహ్రూ ప్రభుత్వ రంగ సంస్థలను ఆధునిక దేవాలయాలుగా పేర్కొనగా, నేటి పాలకులు వాటిని కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు తహతహలాడటంపై విశాఖ ఉక్కు కార్మిక సంఘాల నాయకులు మండిపడుతున్నారు. జాతి సంపదైన ప్రభుత్వ రంగ సంస్థలను పోరాటాలతో కాపాడుకుంటామని వారు స్పష్టం చేస్తున్నారు. స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేందుకు, కొనేందుకు ఎవరొచ్చినా వారిని తరిమితరిమి కొడతామని హెచ్చరిస్తున్నారు. పబ్లిక్ సెక్టార్‌ను భావితరాలకు అందించేందుకు ఎటువంటి త్యాగాలకైనా సిద్ధమని పేర్కొన్నారు.

– ప్రజాశక్తి, ఉక్కునగరం విలేకరి

ప్రభుత్వ రంగంతోనే ఉద్యోగ భద్రత

విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలో ఉండడం వల్ల కార్మికులు కనీస సౌకర్యాలను సాధించుకున్నారు. పిఎఫ్, ఇఎస్ఐ, బోనస్, ఫుల్ అండ్ ఫైనల్ సెటిల్‌మెంట్ వంటి సౌకర్యాలను సాధించుకోగలిగాం. ఉక్కు పరిశ్రమలో కార్మికులకు ఉద్యోగ భద్రత అత్యంత ప్రాధాన్యమైన అంశం. కాంట్రాక్టర్ మారినా కార్మికుడు కొనసాగే విధంగా పోరాడి సాధించుకోగలిగాం. ప్రభుత్వ రంగ సంస్థ కావడం వల్ల పని భద్రత, సేఫ్టీ పక్కాగా అమలవుతున్నాయి. ప్రయివేటు సంస్థల్లో కార్మికుల భద్రతను గాలికి వదిలేస్తారు. ఇటీవల అచ్యుతాపురం సెజ్‌లో జరిగిన ప్రమాదమే దీనికి నిదర్శనం.

– జి.శ్రీనివాస్
అధ్యక్షులు
స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం
(సిఐటియు)

ప్రభుత్వ రంగంతోనే సురక్షితం



కార్మికవర్గం ప్రభుత్వరంగంలోనే సురక్షితంగా ఉంటుంది. కార్మికులు అన్ని రకాలుగా ప్రయోజనాలు పొందాలన్నా, ఎలాంటి నియంతృత్వ పోకడకులకు పోకుండా సాఫీగా పనులు జరగాలన్నా ప్రభుత్వ రంగంలో పరిశ్రమలు ఉండడం అత్యంత అవసరం. ప్రభుత్వ రంగంలోని కార్మికుల మనుగడ ప్రశాంతంగా కొనసాగుతోంది. కేంద్ర ప్రభుత్వం ప్రయివేటు రంగానికి ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వ రంగాన్ని నియంత్రించాలని చూడటం దుర్మార్గం. ఈ చర్యలను ఐక్యంగా కార్మిక వర్గం తిప్పికొడుతుంది.

– మంత్రి రాజశేఖర్
స్టీల్‌ప్లాంట్
ఐఎన్‌టియుసి నాయకులు

ప్రభుత్వ రంగంతోనే సమాన హక్కులు

రాజ్యాంగం చెప్పిన మేరకు ప్రతి ఒక్కరూ సమాన హక్కులు పొందాలంటే తప్పనిసరిగా ప్రభుత్వ రంగ సంస్థలు మనుగడలో ఉండాలి. భవిష్యత్తు తరాలు మెరుగైన జీవన విధానాన్ని పెంపొందించుకోవడానికి ప్రభుత్వ పరిశ్రమలు దోహదపడతాయి. అన్ని రంగాలకు ప్రోత్సాహం లభిస్తుంది. ఐక్యంగా పోరాడి కార్మిక హక్కులను సాధించుకోగలుగుతారు. నూతన కేంద్ర ప్రభుత్వ విధానాలు కార్మిక హక్కులను కాలరాసే విధంగా ఉన్నాయి. నియంతృత్వ పోకడలను మానుకొని ప్రభుత్వ రంగ పరిశ్రమ పరిరక్షణ చేపట్టి, 4 లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలి.

– డి.ఆదినారాయణ
స్టీల్‌ప్లాంట్ ఎఐటియుసి నాయకులు

రేపటి తరానికి ప్రభుత్వ ఆస్తులు ప్రశ్నార్థకమే

సామాజిక, ఆర్థిక, కుల అసమానతలు రీత్యా మన దేశంలో ప్రయివేటు రంగ పెట్టుబడులు పనికిరావు. భారత ప్రభుత్వరంగ సంస్థలను, సంబంధిత ఆస్తులను, ప్రకృతి సహజ వనరులు మొత్తం ప్రయివేటు యాజమాన్యాల హక్కుల కిందకు బదిలీ చేస్తూ అమ్మేస్తుండటం వల్ల ఇక రేపటి తరాలకు ప్రభుత్వ ఆస్తులు అంటూ ఏమీ మిగలవు. ప్రభుత్వం సామాజిక బాధ్యతగా అమలుచేస్తున్న ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి, ఇడబ్ల్యుఎస్, మాజీ సైనికులు, వికలాంగులకు విద్య, ఉద్యోగాల రిజర్వేషన్లు ప్రయివేటు రంగంలో ఉండవు. సామాజిక, ఆర్థిక సమన్యాయం జరిగేంత వరకు మన దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలు ఉండి తీరాలి.

– పరంధామయ్య
యూనియన్ ఆఫ్ స్టీల్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు

పోరాటంతోనే నిలబడిన బిహెచ్‌పివి

ఎస్.జ్యోతీశ్వరరావు,
పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ
కో-కన్వీనర్

కేంద్ర ప్రభుత్వం 1991లో తెచ్చిన నూతన ఆర్థిక విధానాలతో బిహెచ్‌పివి కష్టాల్లో పడింది. వర్క్ ఆర్డర్ రాకపోవడం, ఎల్ అండ్ టి లాంటి పరిశ్రమలు పోటీకి రావడం పరిశ్రమ సంక్షోభంలోకి నెట్టబడింది. కార్మికులకు జీతాలు చెల్లించలేని పరిస్థితి దాపురించింది.

1966 జూన్ 25న బిహెచ్‌పివి ఏర్పాటుకు అప్పటి కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి శంకుస్థాపన చేశారు. తర్వాత 4000 మంది పర్మినెంట్ ఉద్యోగులు, 500 మంది కాంట్రాక్టు కార్మికులు పనిచేసేవారు. నూతన ఆర్థిక విధానాల తర్వాత బిహెచ్‌పివి పరిస్థితి దిగజారుతూ వచ్చింది. పిఎఫ్ లోనులు ఇచ్చేవారు కాదు. కో-ఆపరేటివ్ సొసైటీలు దివాళా తీశాయి. 2001లో సిఐటియు, ఐఎన్‌టియుసి ఫ్రాక్షన్, బిహెచ్‌పివి ఎంఎస్ ఫ్రాక్షన్ కలిసి ఉమ్మడిగా యూనియన్ ఎన్నికలలో పోటీచేశాయి. గౌరవాధ్యక్షులుగా సిహెచ్.నర్సింగరావు గెలిచారు. ఆ ఎన్నికల్లో గంటా శ్రీనివాసరావును ఓడిపోయారు. ఈ కాలంలోనే ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కంపెనీలో పెద్ద పోరాటాలు జరిగాయి. కుటుంబాలతో సహా పోరాటంలోకి వచ్చారు. ఆనాడు కేంద్రంలోఉన్న వాజ్‌పాయ్ నేతృత్వంలోని బిజెపి, రాష్ట్రంలో ఉన్న చంద్రబాబు ప్రభుత్వాల నుంచి సహాయం అందలేదు. కేంద్ర ప్రభుత్వం ఎల్ అండ్ టితో బేరసారాలు జరిపింది. బిహెచ్‌పివిని కొనుగోలు చేయడానికి ఎల్ అండ్ టి కంపెనీని అధికారికంగా కేంద్రం పంపించింది. బిహెచ్‌పివిలోకి ఎల్ అండ్ టి కార్మికుల రాకను కార్మికులు వ్యతిరేకించారు. వచ్చిన వారిని వచ్చినట్లుగా కార్మికులు వెంటబడి తరిమి కొట్టారు. ఎల్ అండ్ టి అధికారులు పలాయనం చిత్తగించారు. కేంద్రంలో ఉన్న వాజ్‌పాయ్ ప్రభుత్వం ప్లాన్ మార్చుకొని ఎల్ అండ్ టి నుంచి ఒక అధికారిని మేనేజింగ్ డైరెక్టర్‌గా ఎంపిక చేసి బిహెచ్‌పివికి పంపించింది. వచ్చిన ఎమ్‌డి కర్మాగారానికి వర్క్ ఆర్డర్లు తేకుండా, కార్మికులకు పని లేకుండా కుట్రకు పూనుకున్నాడు. ఎమ్‌డి మోసాన్ని సిఐటియు గుర్తించి, మే డే రోజున జెండా ఎగురవేసి, మేనేజింగ్ డైరెక్టర్ గోబ్యాక్ నినాదాన్ని ఇచ్చిది. హైవే నుంచి బిహెచ్‌పివి అడ్మిన్ బిల్డింగ్ వరకు ప్రదర్శన చేసింది. పెద్దపెట్టున నినాదాలతో నిరసన చేపట్టింది. ఎమ్‌డిని బాధ్యతల నుంచి తొలగించాలని డిమాండ్ చేసింది. అప్పటి నుంచి ఉద్యమం ఊపందుకుంది. కొన్ని నెలలకు ఎమ్‌డి రాజీనామా చేసి వెళ్లిపోయాడు. ఆ సమయంలో దేశంలో ఎన్నికలు వచ్చాయి. రాష్ట్రంలో టిడిపి ఓడిపోయింది. కాంగ్రెస్ గెలిచింది. వైఎస్. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. కేంద్రంలో వామపక్షాల సహకారంతో యుపిఎ-1 ప్రభుత్వం ఏర్పాటైంది. మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం ఏర్పడింది. రాష్ట్రంలో రాజశేఖరరెడ్డి ప్రభుత్వం బిహెచ్‌పివి టౌన్‌షిప్ స్థలం కొంత భాగం అమ్ముకొని అప్పులు తీర్చుకొని కర్మాగారం నడుపుకోవచ్చు కదా అని సలహా ఇచ్చింది. దీన్ని సిఐటియు వ్యతిరేకించింది. పోరాడింది. సీతారాం ఏచూరి జోక్యంతో మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం భెల్‌లో విలీనం చేయడానికి అంగీకరించింది. ప్రత్యేకంగా కమిటీని ఏర్పాటుచేసి 2018 మే 10న బిహెచ్‌పివిని భెల్ యాజమాన్యం టేకోవర్ చేసుకుంది. ఇప్పుడు మహరత్నగా కొనసాగుతోంది. భెల్ 17వ యూనిట్‌గా ఉంది.

బిహెచ్‌పివికి కూత వేటు దూరంలో ఉన్న హిందూస్తాన్ జింక్ పరిశ్రమ 1977 మార్చి నుంచి ఉత్పత్తి ప్రారంభించి బాగా నడిచింది. కేంద్రంలోని వాజ్‌పాయ్ ప్రభుత్వం జింక్ పరిశ్రమను ప్రయివేటు సంస్థ అయిన వేదాంతకు అప్పగిచ్చింది. ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా యూనియన్ ప్రతిఘటించినా దీర్ఘకాలం కొనసాగలేదు. ప్రయివేటీకరణ ఫలితంగా ప్రస్తుతం ఆ పరిశ్రమ మూతపడింది.

ప్రభుత్వ రంగంతోనే ప్రయోజనం

భారతదేశంలో ప్రభుత్వరంగ సంస్థలకు ఒక చారిత్రక ఆధిపత్యం ఉంది స్వాతంత్రం వచ్చిన తర్వాత ప్రణాళికల ద్వారా ఆర్థిక రంగాన్ని అభివృద్ధి చేయాలన్న బొంబాయి ప్రణాళికలు పక్కనబెట్టి, నాటి ప్రధాని జవహార్ లాల్ నెహ్రూ,అతని మంత్రివర్గ సహచరుడు అంబేద్కర్ ప్రభుత్వ రంగ అవసరాన్ని గుర్తించారు. సామ్యవాద అనుకూలురైన వీరిద్దరూ 1948లో పారిశ్రామిక విధానం రూపొందించి, ఆర్థిక వ్యవస్థ స్వతహాగా ముందుకు సాగాలంటే పరిశ్రమలను మూడుభాగాలుగా ఏర్పాటు చేయాలని భావించారు. ముఖ్యమైన భారీ పరిశ్రమలన్నీ ప్రభుత్వ రంగంలోనూ, మరికొన్ని మిశ్రమరంగంలోనూ, చిన్న తరహా వంటి పరిశ్రమలు ప్రైవేటు రంగంలోనూ ఉండాలని నిర్ణయించారు బడ్జెట్‌లో అవసరమైన ఆర్థిక వనరులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమకూర్చి, అంతర్జాతీయ పెట్టుబడిదారులతో పోటీపడి స్టీల్, సిమెంట్, భారీయంత్ర సామాగ్రి వంటి పరిశ్రమలను ప్రభుత్వ రంగంలోనే ఏర్పాటు చేశారు. 2008లో ఆర్థిక సంక్షోభం తర్వాత భారత వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలు ప్రభుత్వరంగ అవసరాన్ని గుర్తించాయి. వైవిధ్యభరితం, విభిన్న కులాలు,మతాలకు నెలవైన మనదేశంలో పరిశ్రమల అభివృద్ధి, అన్ని వర్గాలకు సామాజిక న్యాయం జరగాలంటే లాభాపేక్ష లేని ప్రభుత్వరంగ సంస్థల వల్లే సాధ్యం. అయితే కార్పొరేట్లు, ప్రైవేటు పెట్టుదారుల ప్రయోజనాలే లక్ష్యంగా పనిచేస్తున్న నేటి ప్రభుత్వాలు, ప్రభుత్వరంగాన్ని నిర్వీర్యం చేయాలని కుట్ర పన్నుతున్నాయి. బహుజనులకు రిజర్వేషన్లు, ఆర్థికప్రయోజనాలు చేకూరాలంటే, పరిశ్రమల నిర్వహణ ప్రభుత్వ రంగంలోనే ఉండాల్సిన అవసరం ఉంది. ఆ దిశలో సాగుతున్న ఉద్యమాలు,పోరాటాలను ఆహ్వానించి, భాగస్వాములు కావడం అందరి బాధ్యత

ప్రొఫెసర్ కెఎస్.చలం, ద్రవిడ యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్

ప్రభుత్వ రంగంలోనే బాధ్యత

ప్రభుత్వ రంగంలోనే పరిశ్రమలకు రక్షణ, బాధ్యత ఉంటుంది. సమాజంలోని ప్రతి తరగతి ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం ఏకరీతిగా బాధ్యత వహిస్తుంది. ప్రభుత్వాన్ని ఆర్థికంగా బలోపేతం చేయడం ద్వారా ఇది సాధ్యమవుతుంది. పబ్లిక్ అండర్‌టేకింగ్‌లు ప్రభుత్వానికి సంపాదిస్తాయి. ఇది పౌరులందరికీ ఆరోగ్యం, విద్య, గృహాలను చూసుకుంటుంది. ప్రభుత్వ రంగంలో బడుగుబలహీన వర్గాలను పరిగణనలోకి తీసుకుంటారు. మరోవైపు ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోని ప్రయివేటు రంగం తమకుతామే సంపాదిస్తోంది. వైజాగ్ ఉక్కు కర్మాగారం వంటి ప్రభుత్వ పరిశ్రమలు పేద, బలహీన వర్గాలతో సహా అనేక మంది స్థానిక ప్రజలు, కార్మికుల త్యాగాలతో నిర్మించబడ్డాయి. పెద్ద మొత్తంలో ఉపాధిని సృష్టించడానికి ప్రభుత్వం హామీ ఇచ్చింది. అలాంటి ప్రభుత్వం ప్రైవేటీకరణ దిశగా అడుగులు వేస్తూ హామీలకు దూరంగా ఎలా వెళ్తుంది. మనది గొప్ప దేశం, భారతదేశం ఒక రిపబ్లిక్. అంటే అది ప్రజలచే ప్రాతినిధ్యం వహిస్తుంది. ప్రజల సంక్షేమాన్ని, వారికి ఇచ్చిన హామీలను తిరస్కరించే హక్కు ఏ ప్రభుత్వానికీ లేదు. ప్రజలందరి సంక్షేమం పబ్లిక్ అండర్‌టేకింగ్‌తో సాధ్యమవుతుంది. ఇది ప్రైవేట్ రంగం ద్వారా కాదు.

- జిఎస్ఎన్.రాజు,
వైస్ ఛాన్సలర్,
సెంచూరియన్ యూనివర్సిటీ

తెలుగు ప్రజల హక్కు.. విశాఖ ఉక్కు

(3వ పేజీ తరువాయి..) 2015 వరకు సుమారు రూ.12,900 కోట్లు లాభాలు వచ్చాయి. ప్రభుత్వం కేటాయించిన సొమ్మును ప్లాంట్ తిరిగి చెల్లించగలిగింది. అనంతరం మిగులు సొమ్ముతో పాటు, రూ. 18 వేల కోట్లకు పైగా అప్పుచేసి 7.3 మిలియన్ టన్నుల సామర్థ్యానికి స్టీల్‌ప్లాంట్‌ను విస్తరించేందుకు ప్రయత్నాలు జరిగాయి. 2008 నుంచి 2019 వరకు 10 వేల పర్మినెంట్, కాంట్రాక్ట్ ఉద్యోగాలు వచ్చాయి. నిర్వాసిత కుటుంబాలకు, ఎస్‌టి, ఎస్‌టి, బిసి, మైనారిటీ, మాజీ సైనిక ఉద్యోగులు, మహిళలు, వికలాంగులకు ఉద్యోగాలు లభించాయి.

వెంటాడుతున్న ముడి ఖనిజ సమస్య

ప్లాంట్ సామర్థ్యం పెంచుకున్నా, ముడిఖనిజం సమస్య స్టీల్‌ప్లాంట్‌ను వెంటాడుతూనే వుంది. కేంద్రప్రభుత్వం దేశంలోని ప్రైవేటు, ప్రభుత్వ స్టీల్ పరిశ్రమలతోపాటు, స్టీల్‌ప్లాంట్ నిర్మాణమే చేపట్టని పోస్కోకు సైతం ఐరన్‌ఓర్ గనులు కేటాయించింది గానీ, పభుత్వరంగ సంస్థ విశాఖ స్టీల్ ప్లాంట్‌కు నేటికీ ఐరన్‌ఓర్ కేటాయించలేదు. సొంత గనులున్న స్టీల్‌ప్లాంట్లకు ఒక టన్ను ఉత్పత్తికి కేవలం రూ.500 ఖర్చు అవుతుండగా, విశాఖ స్టీల్‌ప్లాంట్ మార్కెట్‌లో ఐరన్ ఓర్ టన్నును రూ.5 వేల నుంచి రూ.8 వేలకు కొంటోంది.

హైకోర్టు ఆదేశాలు బేఖాతరు

సెయిల్ నుంచి నుంచి స్టీల్‌ప్లాంట్‌ను వేరుచేసినప్పుడు బైలదిల్లాలోని 4, 5 బ్లాకుల గనులను విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌కు కేటాయించి, ఐరన్ ఓర్ సరఫరా చేస్తామని నమ్మబలికారు. అయితే మన రాష్ట్రంలోని ఐరన్ ఓర్ గనులను విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కేటాయించాలని సిఐటియు హైకోర్టును ఆశ్రయించింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎల్ నరశింహారెడ్డి విశాఖ స్టీల్ ప్లాంట్‌కు సొంతగనులు కేటాయించే అంశాన్ని పరిశీలించాలని నాటి ప్రభుత్వానికి ఆదేశించారు. అయినా గనులు కేటాయించకుండా. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇబ్బందులు పాల్జేస్తున్నాయి. సముద్ర తీరాన స్టీల్‌ప్లాంట్ నిర్మించినట్టయితే రవాణాకు అనుకూలమై, అత్యంత తక్కువ ఖర్చుతో ముడిసరుకును దిగుమతితోపాటు, స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తులను చౌకగా ఇతర దేశాలకు ఎగుమతి చేసుకోవచ్చని భావించారు. అనుబంధంగా పిపిపి విధానంలో గంగవరంలో పోర్టు నిర్మించినా, దాన్ని అదానీకి కట్టబెట్టారు. ఆ ప్రభావం స్టీల్‌ప్లాంట్‌పై పడింది. ముడిసరుకు రాకుండా ఇబ్బందులను సృష్టించడంతో రూ.మూడు వేల కోట్లు పైగా నష్టం వాటిల్లింది.

పరిశ్రమలు, ప్రభుత్వ రంగ సంస్థలు ఆధునిక దేవాలయాలంటూ నాటి ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్ వంటి పరిశ్రమలను ఏర్పాటు చేస్తే, వ్యాపారం ప్రభుత్వ పని కాదంటూనే ప్రభుత్వ సంస్థలు చావడానికే పుట్టాయంటూ మోడీ ప్రభుత్వం ప్రజల సొమ్ముతో ఏర్పాటైన వీటిని పెట్టుబడిదారులకు కట్టబెడుతోంది. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను నూరు శాతం అమ్మాలని 2021 జనవరి 27న నిర్ణయించింది. ఉత్తరాంధ్ర అభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన విశాఖ ఉక్కుపై ప్రత్యక్షంగానూ, పరోక్షంగా ఆధారపడి సుమారు లక్ష మంది జీవిస్తున్నారు. రాష్ట్రంలోనే అధిక తలసరి ఆదాయం గాజువాకకు ఉండడానికి విశాఖ ఉక్కు కారణం. అయినా దీన్ని ప్రైవేటీకరించడానికి కుట్రలు చేస్తుండటంతో కార్మికవర్గం అలుపెరగని పోరాటం చేస్తోంది. ఆ ఉద్యమాన్ని పట్టించుకోకుండా.. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేస్తాం లేదా మూసేస్తామంటూ మోడీ సర్కారు ముందుకెళ్తోంది. ఈ క్రమంలోనే ఉత్పత్తికి అవసరమైన ముడిసరుకు సరఫరాను కావాలనే నిలిపేసి, బ్లాస్ట్ పర్నేస్‌లను మూసేసి ఉత్పత్తి పడిపోయేలా చేస్తోంది. ఉద్యోగులపై ఆర్థిక దాడి చేస్తోంది. ఆరు నెలలుగా సకాలంలో జీతాలు చెల్లించడంలేదు.

ఉద్యోగులను విఆర్ఎస్ పేరుతో బయటకు పంపే కుట్ర చేస్తున్నారు. నాలుగువేల మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించే కుట్రలు సాగుతున్నాయి. ప్లాంట్‌ను రక్షిస్తామని హామీనిచ్చి గెలిచిన టిడిపి కూటమి ప్రభుత్వం నేడు నాన్చుడు వైఖరి అవలంబిస్తోంది. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని ఆపుతున్నట్లు స్పష్టమైన ప్రకటన చేయించాలని చంద్రబాబు, పవన్‌లను కార్మికవర్గం డిమాండ్ చేస్తోంది.